6.10.1995 శుక్రవారం 10 పేజీలు సంపుటి:67 సంచిక:38 విడిప్రతి రూ. 2.00 లు Phone: 27354 Regd. No. HNL 18

జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

50 మంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటుకు సన్నాహాలు?

దగ్గుపాటి మళ్లీ బోర్డు త్రిప్పనున్నాడా?

తోడల్లుళ్లిద్దరి మధ్య కుదిరిన సంధి ఒప్పందం విచ్ఛిన్నమై పోయే సూచనలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. చిన్నల్లుడు చంద్రబాబు రాజకీయ ప్రాభవాన్ని చూచి ఓర్వలేని పెద్దల్లుడు డాక్టర్ వెంకటేశ్వర రావు ఆయనతో తెగత్రెంపులు చేసుకొని బయట పడడానికి సిద్ధంగా వున్నాడని రాజకీయ జ్యోతిష్కుల వూహ. గత వారం రోజులుగా శరవేగంగా జరిగి పోతున్న రాష్ట్ర రాజకీయ పరిణామాలూ ఈ అభిప్రాయాన్ని బల పరుస్తున్నాయి.

లక్ష్మీపార్వతి పైన చంద్రబాబు, ఇతర ఎమ్మెల్యేలు ప్రకటించిన తిరుగుబాటు యుద్ధానికి డాక్టర్ వెంకటేశ్వర రావు నైతిక బలం చేకూర్చారు. నిజానికి ఈ ఇద్దరల్లుళ్ల మధ్య ఎప్పుడూ రాజకీయ నెయ్యం లేదు. ఎన్టిఆర్ పెత్తనం సాగినన్నాళ్లూ వీరు భిన్న శక్తులుగా, శత్రు శిబిరాలుగా కలహించు కొంటుండే వారు; ఉత్తర దక్షిణ ధృవాలుగా చలామణి అయ్యే వారు. అయితే. వెంకటేశ్వర రావుది సాత్విక మనస్తత్వం. రాజకీయ జిమ్మిక్కులు, టక్కుటమార విద్యలూ చేత కావు. అందువల్ల చంద్రబాబుతో ఆయనెప్పుడూ సరి తూగే వాడు కాదు. మామ గారి దగ్గర తన మాట చలామణి చేసుకో గలిగేవాడు కాదు. పెద్దల్లుడు అనే హోదాలో పార్లమెంటరీ పార్టీ నాయకత్వం లభించిందాయనకు.

> మామతో తిరిగి చుట్టరికానికి సతీమణితో రాయబారం;
> అల్లుడ్ని స్వాగతించను లక్ష్మీపార్వతి అంగీకారం?

అయితే తిరుగుబాటు సమయంలో వెంకటేశ్వర రావు ఇచ్చిన నైతిక మద్దతు చంద్రబాబుకు ఎంతో వుపయోగ పడింది. లక్ష్మీపార్వతి దుర్మార్గాలకు వ్యతిరేకంగా కుటుంబ సభ్యు లందరినీ ఏకం చేయడానికి పనికి వచ్చింది. ఆ అవసర సమయంలో తోడల్లుడ్ని సంతోష పెట్టడానికి చంద్రబాబు ఉప ముఖ్య మంత్రిత్వపు ఆశ చూపించాడు. అప్పటి అవసరం అటువంటిది మరి! కాని చంద్రబాబు ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు వ్యవహరించడంతో వెంకటేశ్వర రావుకు మనసు కష్టం కల్గింది. అప్పటికీ ఈ నెల రోజులు ఓపిక పట్టాడు. ఒకటికి రెండు సార్లు తన సంగతి చంద్రబాబు దగ్గర ప్రస్తావించాడు. కానీ ఆయన తెలివిగా ఔననక, కాదనక సర్ది చెప్పి పంపేశారు. తన రాజకీయ బ్రతుకు గాలిలో దీపం వలె తెల్ల వార లాడు తుండడం వెంకటేశ్వర రావుకు ఆందోళన కల్గిస్తున్నది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. ఇంకొక ప్రక్క చంద్రబాబు అనుచరులు హేళనగా మాట్లాడు తున్నారు. ఉప ముఖ్యమంత్రిత్వం ఆరవ వేలు వంటిదని అశోక గజపతి రాజు చేసిన వ్యాఖ్యానం దగ్గుపాటికి పుండు మీద కారం చల్లి నట్లుండింది. ఆయనలో ఓపిక నశిస్తూంది. ఏదో ఒక తీవ్రమైన నిర్ణయం తీసుకోకుంటే మీతో పాటు మేమూ రాజకీయంగా సమాధై పోతామని ఆయనతో వుండే ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తున్నారు.

అటు ప్రక్క ఎన్టిఆర్ ఎమ్మెల్యేలకు తలుపులు తెరిచారు. చంద్రబాబు దగ్గర నుంచి తిరిగి వచ్చే వారందరినీ తాను సాదరంగా స్వాగతిస్తానని ప్రకటించారు. దగ్గుపాటి విషయంలో ఆయన మరీ ప్రత్యేకంగా ప్రకటన చేశారు. ఈ అవకాశాన్ని వాడుకొని తన రాజకీయ భవిష్యత్‌ను మళ్లీ దారిలో పెట్టు కోవాలన్నది వెంకటేశ్వర రావు సంకల్పం.

క్యాబినెట్ విస్తరణ జరిగే లోపల బోర్డు త్రిప్పేయా లన్నది దగ్గుపాటి నిర్ణయ మంటున్నారు. విస్తరణలో పదవి రాకుంటే, అందుకోసం ఫిరాయించాడన్న నింద పైన పడుతుందని, ఈలోగా వెళ్లిపోతే జనాన్ని మెప్పించే కారణం ఏదో ఒకటి వెతికి చెప్ప వచ్చునని ఆయన

కొరవ 6 పేజీలో





నీ దయా దాక్షిణ్యాలు నాకేం అక్కర్లేదు! న్యాయంగా నాకు రావల్సింది నాకివ్వు చాలు----!..!

దేశం కమిటీ నియామకం

చంద్రబాబుకు ఎందుకంత జంకు?

ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ విస్తరణ విషయంలో ఇప్పటికీ ఒక స్థిర నిర్ణయానికి రాలేకున్నారు. కొందరికి మాత్రం మంత్రి ల్ఇచ్చి, అందర్నీ సంతోష పెట్టడమెట్లా అనే విద్య ఆయనకు అందుబాటు కావడం లేదు. వెంకటేశ్వర రావు విషయంలో కూడా ఆయన ఎటూ తేల్చు కోలేక పోతున్నారు. క్యాబినెట్ విస్తరణ ఆలస్యమయ్యే కొద్దీ, ఎమ్మెల్యేలలో అసంతృప్తి పెరిగి పోతున్నది. వారి నుంచి వత్తిడి తట్టుకోలేక ఆయన క్రమంగా ఆత్మ విశ్వాసం కోల్పోతున్నారు. పదవి ప్రమాణం చేసి నెల రోజులు గడిచి పోయినా ఆయనలో అభద్రతా భావం తొలగ లేదు. నమ్మకంగా, ధైర్యంగా, సాహసించి ఏ నిర్ణయమూ తీసుకో లేకున్నారు. [illegible] బెరుకుగా, జంకు [illegible] పాలన జరుగు తున్నది. నిత్యావసర వస్తువుల చట్టం విషయంలో ఇది బాగా ప్రస్ఫుటమైంది. ముందు ఆ చట్టాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించాడు; ఆ తర్వాత నాలుక కరుచుకొని చట్టం అట్లే వుంటుంది. గేటులు మాత్రం పెట్టం అన్నాడు. రాష్ట్ర అధికారులతో సమావేశాలు జరిపే టప్పుడు కూడా ఆయనలో ఆత్మ విశ్వాసం కంటే, ఆత్మన్యూనతా భావం వ్యక్త మౌతున్నది. తాను ఈ రాష్ట్రానికి స్థిరమైన ప్రభుత్వాధి నేతనన్న ధీమాతో అధికారులతో మాట్లాడడం ఆయనకు అలవి కావడం లేదు.

ఆయనలో ఇంతటి బెరుకుకు కారణం మంత్రి వర్గ విస్తరణలో వైఫల్యమే ననాలి. అది ఆయనకు, ఆయన ప్రభుత్వానికి అగ్నిపరీక్ష వంటిది. ఇప్పటికి ఏ పదిసార్లో ఆయన ఈ విషయమై అంత రంగికులతో చర్చలు జరిపారు. ఏఏ జిల్లాలో ఎవరికి ఇస్తే ఎట్లా వుంటుందన్న ఎక్సర్ సైజు చేశారు. కానీ నిర్ణయం తీసుకోవడానికి ధైర్యం చాలడం లేదు. ఎన్టిఆర్ తలుపులు తెరుచుకుని కూర్చోవడం, ఆయన ఇంటికి జనం రద్దీ పెరగడం మరీ భయం కల్పిస్తున్నది.

ఈనాడు పత్రికాధిపతి శ్రీ రామోజీ రావు అప్పటికీ బాగా ధైర్యం

కొరవ 6 పేజీలో

ఆంధ్రకు పదవులు హుళక్కి?

ప్రధాన మంత్రి శ్రీ పివి నరసింహా రావు ఆంధ్ర రాష్ట్రం విషయంలో తన నిరాదరణను ఏ మాత్రం సడలించడం లేదు. క్యాబినెట్‌లోనే కాదు - పార్టీ పదవులకు సంబంధించి కూడా ఆయన తెలుగు నాయకులను పూర్తిగా విస్మరిస్తున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిత్వం ఆంధ్రకు వస్తుందన్న వూహా గానాలను ప్రక్కకు నెట్టి, తన పై బహిరంగంగా అసమ్మతి ప్రకటించిన ఉత్తరాది నాయకుడు టిపి మౌర్యను ఆ స్థానంలో కూర్చో బెట్టడంతో, ఇక ఆంధ్రకు పదవులు హుళక్కి అన్న అభిప్రాయం ఏర్పడి పోయింది. ఇవ్వడానికి ఇక పదవులు కూడా ఏవీ మిగిలి లేవు.

> పివి ఆంతర్యం పరమాత్ముడికెరుక!

పార్లమెంట్ ఎన్నికలు కనుచూపు మేరలోకి వచ్చిన సమయంలో ప్రధాన మంత్రి ఆంధ్ర పట్ల ఇంత నిర్లక్ష్య భావం ప్రదర్శించ డానికి కారణ మేమిటో అంతు చిక్కడం లేదు. ఆయన ఆంతర్యం పసి గట్టడం పరమాత్ముడికే అలవి కాదు. అయితే ఇటు నేదురుమల్లి జనార్దన రెడ్డి, అటు వైఎస్ రాజశేఖర రెడ్డి లిద్దరినీ ప్రక్కన బెట్టి పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కొనే దెట్లా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పే వారు లేరు. రోశయ్య వంటి నాయకులు వ్యక్తిగతంగా పలుకుబడి కలిగిన వారే కానీ, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని నడిపించే సామర్థ్యం వారికి లేదు. ఆంధ్రలో ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ కుదుట పడుతున్నది తెలుగు దేశం

కొరవ 6 పేజీలో

తాత్కాలిక పెరుగుదలకు భ్రమలొద్దు!

పైసా విలువ చేయని పనికి మాలిన షేర్ల ధరలు పెంచి ముంచడానికి బ్రోకర్ల యత్నం!

షేర్ మార్కెట్ ధరల సూచిక పెరుగుదల చూసి చాలా మంది ఇన్వెస్టర్లలో ఆశలు రేకెత్తుతున్నట్టున్నాయి. చాలా నెలల పాటు 3200 పాయింట్ల ప్రాంతంలో తచ్చాడుతుండిన ఇండెక్స్ ఇటీవలే పునరుజ్జీవం పొంది 3500 పాయింట్ల మార్కును దాటింది. ఒక విధంగా సంతోషించ వలసిన పరిణామమే ఇది.

> జూన్ వరకు నిజమైన షేర్ల ధర పెరుగుదల కష్టం; అంత దాకా ఓపిక పట్టడమే శరణ్యం!

అయితే ఈ తాత్కాలిక పెరుగుదలతోనే ఏదో మహాత్యాలు జరిగి పోతాయను కోవడం వట్టి భ్రమ. సంక్షుభిత స్థితి నుంచి మార్కెట్ పూర్తిగా కోలుకుని, నిలకడగా పురోగమించడానికి ఇంకా వ్యవధి వుంది. ఇప్పుడు జరుగు తున్నది షార్ట్ టర్మ్ ర్యాలీ మాత్రమే; లాంగ్ టర్మ్ ర్యాలీ కోసం ఎదురు చూడవలసిన అవసరం వుంది.

ఈ సమయంలో ఇన్వెష్టరు షేర్ల ఎంపిక విషయంలో జాగ్రత్తగా వుండడమే కాదు, కొందరు బ్రోకర్లు పన్నే మోసపు పన్నాగాల నుంచి తప్పించు కోవడానికి అప్రమత్తతో వ్యవహరించ వలసిన అవసరమూ వుంది. మార్కెట్‌లో మంచి కంపెనీల షేర్లు చాలా వరకు చవక ధరల్లో లభ్యమౌ తున్నాయన్న మాట నిజం. డిమాండ్ లేనందువల్ల పలు కంపెనీల షేర్ ధరలు కూడా తక్కువగా వున్నాయి. అయితే ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకొని, ఇన్వెష్టర్లను భ్రమలో పెట్టి, పైసా విలువ చేయని చెత్త కంపెనీల షేర్లకు ధరలు పెంచి అమ్మడానికి కొందరు బ్రోకర్లు మోసపు ఆలోచనలు చేస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీల విషయంలో ఈ కుట్ర బాగా జరుగు తూంది. అరిహంత్ సెక్యూరిటీస్, ఎల్‌ఆఎస్ ఫైనాన్స్, రీగల్ ఫైనాన్స్, ప్యారో లీజింగ్ వంటి షేర్ల ధరలు ఒకేసారి రు50 నుంచి రు90వరకు పెరిగి పోవడం ఇక్కడ గమనార్హం. ఈ పెరుగుదల కేవలం షేర్ రిగ్గింగ్ వల్ల జరిగినదిగానే భావించాలి.

ఈ ఎత్తులకు సాధారణంగా అమాయకులే మోస పోతుంటారు. మద్రాసులో షేర్ల రిగ్గింగ్ జాస్తిగా వుంది. కోటి రూపాయలు తమ దగ్గర ఇస్తే, రాత్రికి రాత్రి షేర్ల ధరలు పెంచేస్తామని వీరు కంపెనీలకు నమ్మ బలుకు తున్నారు. 20, 30 చిన్న చిన్న ఫైనాన్స్ కంపెనీల ప్రమోటర్లు వీరి చుట్టూ తిరుగు తున్నారు. ఇదెంత మోసమో చెప్పలేము.

ఇటువంటి కంపెనీలను స్పాట్ ట్రాన్స్‌సాక్షన్‌కు తెచ్చి, రిగ్గింగ్ సందేహం కల్గిన కంపెనీలను కొన్ని నెలల పాటు సస్పెండ్ చేస్తే తప్ప ప్రమోటర్లు భయపడరు. అయితే స్టాక్ ఎక్ఛేంజి అధికారులూ ఈ బ్రోకర్లతో మిలాఖత్ అవుతున్నట్లు అనుమానంగా వుంది. లేకుంటే రిగ్గింగ్ పూర్తయి, ప్రమోటర్లు కోట్లు సంపాదించి, ఇన్వెష్టర్లు మునిగి పోయే దాకా గమ్మునుండి, ఆ తర్వాత మాత్రమే చర్యలు తీసు కొంటున్నారు.

ఈ నెలలో దీపావళి వరకు షేర్ల ధరలు పెరుగుతాయి. కొన్ని ఆర్థిక

కొరవ 6 పేజీలో

బాలాజీ బయోటెక్- రొయ్యల పై భారీ ఆశలు!

దేశంలో రొయ్యల పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో కొట్టుక పోతున్నప్పటికి, నెల్లూరు సమీపంలోని తూపిలి పాళెం దగ్గర మాగుంట సోదరులు స్థాపించిన బాలాజీ బయోటెక్ లిమిటెడ్ (దీని పాత పేరు 'మాగుంట అక్వా ఫార్మ్స్ లిమిటెడ్') రొయ్యల పై భారీ ఆశలు పెట్టు కొంటున్నది. ఇప్పటి వరకు వీరు ఈ ప్రాజెక్ట్ పై 84 కోట్లు పెట్టుబడి పెట్టారు. అందులో ప్రమోటర్ల పెట్టుబడి 49 కోట్లు; ఆర్థిక సంస్థలు ఇచ్చిన అప్పులు 35 కోట్లు. 171 హెక్టార్ల భూమిలో 236 చెరువులు త్రవ్వారు. హెక్టారుకు ఏడాదికి 12 టన్నుల లెక్కన 2 వేల టన్నుల రొయ్యలు పండించాలని వీరి ఆశయం. 1995 - 96 సంవత్సరంలో 135 కోట్ల విలువైన రొయ్యలను పండించ గలమని వీరు ఆశిస్తున్నారు.

చెరువులతో పాటుగా రెండు హేచరీలు నిర్మించారు. వీటిలో ఒకటి 6 కోట్ల 30 లక్షల ఖర్చుతో గాల్విస్టెయిన్ పద్ధతిలో నిర్మిస్తే; మరొక దానిని 3 కోట్ల 50 లక్షల ఖర్చుతో తైవాన్ పద్ధతిలో నిర్మించారు. 4 వేల టన్నుల సామర్థ్యం కల్గిన రొయ్యల ప్రాసెసింగ్ కర్మాగారమూ రెడీ అయ్యింది. ఇందులో ఇండి విడ్యువల్ క్విక్ ఫ్రీజింగ్ మెషిన్లతో పాటుగా, అత్యం తాధునికమైన హైప్రెజర్ వాషింగ్ యూనిట్ కూడా నెలకొల్పారు.

రొయ్యలను ఎగుమతి చేయడానికి అమెరికాకు చెందిన రిచ్ సీ ప్యాక్ సంస్థతో మార్కెట్ ఒప్పందం కుదుర్చు కున్నారు.

బాలాజీ బయోటెక్ ఇంకా పబ్లిక్ ఇష్యూ విడుదల చేయలేదు. మార్కెట్ పరిస్థితి మెరుగు పడిన తర్వాత ప్రీమియంతో ఇష్యూ విడుదల చేయాలన్నది వారి సంకల్పం.

పాల పథకాలలో పెట్టుబడి గ్యారంటీగా నీళ్ళ పాలే!

కూటి కోసం కోటి విద్యలని సామెత. అమాయక ప్రజల నుంచి డబ్బు గుంజ డానికి కూడా సవాలక్ష మార్గాలు అన్వేషిస్తున్నారు తెలివైన వ్యాపారులు. టేకు చెట్ల పేరుతో కొన్ని కంపెనీలు కోట్లు జవురు కున్నాయి; గొర్రెల పేరుతో ఇంకొన్ని కంపెనీలు జనాన్ని గొర్రెలను చేసి లక్ష లార్జించాయి. ఇప్పుడు పాల పథకాల పేరుతో ప్రజల నెత్తిన కుచ్చుల టోపి పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పాల పథకాలు ముందుగా మద్రాసులో ప్రారంభమైనాయి. ఇప్పుడు నెల్లూరుకూ ప్రాకినాయి.

4900 రూపాయలు వారికి ఇస్తే, రోజుకి ఒక లీటరు పాలు లెక్కన ఇంటికి డెలివరీ ఇస్తారట. ఐదేళ్ల పాటు ఈ సరఫరా వుంటుందట. 4900 రూపాయలకు మూడు రూపాయల వడ్డీ లెక్క గట్టినా రోజుకు రు. 4.83 పైస లౌతుంది. ఈ ధరకు పాలు ఎట్లా వస్తాయి? ఇప్పుడు నెల్లూరులోనే సుమారైన నాణ్యత కల్గిన పాల ధర లీటరు పన్నెండు రూపాయల వరకు వుంది. నీళ్లు కలిపిన పాలు కొందామన్నా రు. 8లకు తక్కువ దొరకడం లేదు. మరి రోజుకు 4.80 పైసల వడ్డీ విలువతో వీరు లీటరు పాలు ఎట్లా ఇవ్వగలరు. లీటరు పాలకు రెండు లీటర్ల నీళ్లు కలిపినా అది అసాధ్యం. పోనీ డైరీ ఫారం పెట్టి నడుపు తారనుకుంటే, దాని పైన 6 రూపాయల వడ్డీతో సమానమైన ఆదాయం వస్తే తప్ప నీళ్ల పాలు కూడా ఇవ్వలేరు. డైరీ వ్యాపారంలో అంత లాభాలు కాగితాల మీద లెక్కలు వేసి చూసుకొందామన్నా కన్పించవు. రు 4900 లతో పాలుకొని ఇచ్చే పనైతే రోజుకు రు. 2.70 పైసలు వస్తాయి ఆ ధరకు లీటరు నీళ్లు వస్తే గొప్ప. పాలు రాను రాక రావు.

> లీటరు పాలలో రెండు లీటర్ల నీళ్లు కలిపినా నెలనెలా ఇవ్వడం అసాధ్యం; ఉత్తుత్తి మాయలకు మోసపోవద్దు!

మనం ఇచ్చే రు 4900 లు బ్యాంకులో వేసుకున్నా మనకు ఐదేళ్లలో రెట్టింపు మొత్తం చేతికి అందు తుంది వీరి ప్రకటనలకు మోస పోయి ఆ డబ్బు వీరి చేతికిస్తే, ఐదేళ్ల తర్వాత వీరు తిరిగి కన్పడతారన్న గ్యారంటీ లేదు; ఈలోగా వారీ పాలు ఇవ్వకుంటే మనం చేయగల్గింది ఏదీ లేదు.

ఇంకొక కంపెనీ, తమకు 9 వేల రూపాయలు ఇస్తే 5 ఏళ్ల పాటు లీటరు పాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు, ఐదేళ్ల తర్వాత 9 వేలు వాపసు చేస్తామని ప్రకటించింది. లెక్క కడితే రెండు పథకాలూ ఒకటే. ఇటు వంటి పథకాలకు ప్రజలెంత దూరంగా వుంటే అంత మేలు. వీటిలో పెట్టే పెట్టుబడి నీళ్ళ పాలు కావడం మాత్రం గ్యారంటీ.

ఇదిట్లా వుంటే ఇంకొక అతి తెలివి వ్యాపారస్తుడు మరొక మోసపు పథకం కనిపెట్టారు. ఆయన దగ్గర 8 వేల రూపాయలు డిపాజిట్ చేస్తే, ఐదేళ్లపాటు నెలకు 24 సీసాల లెక్కన కూల్‌డ్రింక్స్ ఇస్తాడట; ఐదేళ్ల తర్వాత 8 వేలు వాపసు చేస్తాడట. డబ్బు తీసుకున్న తర్వాత ఆయన కూల్ డ్రింక్స్ సంగతి మర్చిపోతే మనమేమి చేయగలం?

ప్రజల దగ్గర ఉట్టి ఊడియంగా డబ్బు గుంజడానికి ఎన్ని రకాల పథకాలు కనిపెడు తున్నారో ఆలోచించండి. నెల్లూరులో గొర్రెల పథకాల పేరుతో డబ్బు దండిన వారు, ఆ డబ్బుతో బెంగుళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. గొర్రెలు తమకు లాభాలిస్తాయని ఆశ పడిన వారు గొర్రెలుగా మిగిలి పోయారు.

-డాక్టర్ ఎ.డి.పి.

కన్నీటి నీరాజనం



మా ఇంటి వెలుగు, మా ఆశాజ్యోతి, మా కుమారుడు

సోమారెడ్డి అనిల్‌కుమార్ రెడ్డి

(దామరమడుగు)

బెంగుళూరులో 27.9.95 తేది అకాల మృత్యువు పాలై మమ్ము దుఃఖ సాగరంలో ముంచి వెళ్లాడు.

శోకతప్త హృదయాలతో

సోమారెడ్డి దయాకర్ రెడ్డి - తండ్రి సోమారెడ్డి సుజన - తల్లి

సోమారెడ్డి షర్మిల - సోదరి

మరియు కుటుంబసభ్యులు

జననం: 10.8.74 మరణం: 27.9.95

రాజకీయ కల్మషం

గుజరాత్ రాజకీయ పరిణామాలు ఆశ్చర్యం గొల్పుతున్నాయి. అధికార దాహం, కుర్చీ కోసం పోరాటాలలో క్రమ శిక్షణకు మారు పేరైన బిజెపి నాయకులు కాంగ్రెస్‌కు పాఠాలు నేర్పే స్థాయికి ఎదిగిపోవడం ఆశ్చర్యమే కదా? అధికారంలో వుండే వారి కాళ్లు పట్టి క్రిందకు లాగే అసమ్మతి ఉద్యమాల నిర్వహణ ఇంత కాలం కాంగ్రెస్‌కే స్వంతమైన సంస్కృతీ వైభవంగా భావిస్తుంటే వారు. అప్పుడప్పుడూ జనతా దళ్ వంటి పార్టీలు ఆ విద్యను ప్రదర్శిస్తు న్నప్పటికీ, పార్టీలు వేరైనా అందులో వుండేది కాంగ్రెస్ వాదులే కనుక, ఇంగువ కట్టిన గుడ్డ వాసన ఎక్కడు పోతుందని సరి పెట్టుకొనే వారు. కాని అధికార నర మాంసం రుచి మరిగితే ఏ రాజకీయ పులైనా ఒకే తీరులో ప్రవర్తిస్తుందని గుజరాత్ సంక్షోభం నిరూపిస్తున్నది.

ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేశవ భాయ్ పటేల్, అసమ్మతి నాయకుడు శంకర్ సింహ్ వాఘలేలు ఇరువురూ కరడు కట్టిన జన సంఘీయులే! ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్‌లో క్రమ శిక్షణ పాఠాలు నేర్చుకున్న వారే. కాని అధికారం పంపకాని కొచ్చేసరికి ఆ సిద్ధాంత నిబద్ధతలు, పార్టీ క్రమ శిక్షణలు, నాయకత్వానికి విధేయతలులో గాలికి కొట్టుక పోయి మానవ నైజం, రాజకీయ స్వార్థం బలీయమైన ప్రభావాన్ని చూపాయి. పటేల్ కాళ్లు పట్టి క్రిందకు లాగి, కుర్చీలో తానెగిరి కూర్చోవాలని వాఘలే కుట్ర పన్నాడు. 47 మంది బిజెపి ఎమ్మెల్యేలను తన దొడ్లో తోలి, సవాల్ విసిరాడు. పటేల్ తక్కువ తిన్నాడా - కుర్చీని వదిలేది లేదని భీష్మించుకొని, వాఘలే గారి గోశాలలో బంధితులైన వారిని విడిపించు కొని రమ్మని తన రామదండుకు ఆదేశ మిచ్చాడు. రెండు ప్రక్కలా కిరాయి సైనికులు రంగ ప్రవేశం చేయడం, రక్తం కళ్ల చూడడం, ఒక ప్రముఖ పారిశ్రామిక వేత్త సమకూర్చి పెట్టిన ఛార్టర్డ్ విమానంలో వాఘలే రాత్రికి రాత్రి తన ఎమ్మెల్యే లందరినీ సురక్షిత దుర్గం వంటి ఖజురహో విలాస మందిరానికి తరలించడం చకచకా జరిగి పోయాయి. అధికారం కోసం పోరాటంలో ఇరు వర్గాలూ అన్ని నైతిక విలువలు, ప్రజాస్వామ్య సాంప్ర దాయాలకు తిలోద కాలిచ్చేశారు. డబ్బు సంచుల ప్రలోభాలు, ధన స్వాముల తెర వెనుక పెత్తనాలు, నేరస్తులతో నిత్య సంబంధాలు నిర్వహించడంలో కాంగ్రెస్ వాదులకు తామే రీతిలోనూ తీసిపోమని నిరూపించు కున్నారు ఈ నాయకు లిద్దరూ! ఇంత కాలం బిజెపిలో అద్వానీ, వాజ్ పేయిల ఆదేశాలు రామాజ్ఞ వలె పరిగణింప బడేవి; ఈ సందర్భంలో వారి ఉత్తర్వులు ఉత్త చెత్త కాగితం ముక్కలుగా విసిరి వేయ బడినాయి.

బలాబలాల పరీక్షకు ఆ రాష్ట్ర గవర్నరు అక్టోబరు 7 తేది ముహూర్తంగా నిర్ణయించారు; అందులో ఎవరు గెల్చి, ఎవరు ఓడినా, కొన్ని దశాబ్దాల పాటు బిజెపి నాయకులు కష్టపడి, ఓర్పుతో నేర్పుతో నిర్మించిన ఒక రాజకీయ వ్యవస్థ కుప్పు కూలి పోయినట్లె భావించాలి. పటిష్టమైన పార్టీ మనుగడకు, క్రమశిక్షణా యుతమైన కార్యకర్తల నడవడికకు తాము ప్రతీకలమని బిజెపి నాయకులు చేస్తున్న ప్రచారం గాలికి కొట్టుక పోతున్నది. రేపటి పార్లమెంట్ ఎన్నికల సమరంలో ఇతరులకు భిన్నమైన పార్టీగా తమను తాము వర్ణించుకొనే మహ దవకాశాన్ని కోల్పోయారు వారు. ప్రజల దృష్టిలో ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిలు రెండూ - దొందూ దొందే!

జమీన్‌రైతు

రాజకీయ వ్యవస్థను చెద పురుగుల వలె పట్టి, శిథిలం చేస్తున్న ఫిరాయింపుల జాడ్యాన్ని నిరోధించ డానికి; ఆయారాం, గయారాం పోకడలను నివారించ డానికి రాజీవ్ గాంధీ ప్రవేశ పెట్టిన ఫిరాయింపుల చట్టమూ ఇటు వంటి సందర్భాలలో నిర్వీర్యమై పోతున్నది. రాజకీయ కల్మషాన్ని కడిగి పారేయడానికి ఆ చట్టానికి సమకూర్చిన పదును చాలడం లేదు. ప్రభుత్వాలను పైకెక్కించి, క్రిందకు దించడంలో పారిశ్రామిక వేత్తల ధన ప్రభావం దర్జాగా చలామణి కావడమూ అత్యంత ఆందోళన కరమైన విషయం. శంకర్ సింహ్ వాఘలేకు డబ్బు, విమానాలు, ఫైవ్ స్టార్ హోటల్ విలాసాలు సమకూర్చి పెట్టింది రిలయన్స్ అధినేత [illegible] అంబాని అని పత్రికలు ప్రముఖంగా ప్రకటిస్తున్నాయి.

అధికార దాహం, ధన ప్రభావం, నేరస్తులతో సంపర్కం, పదవీ ప్రలోభాలతో ప్రజలు వేసిన ఓటును వ్యర్థం చేసి నాయకులు కుర్చీ పోరాటాలు చేయడం ఘోరం. ఈ రాజకీయ కల్మషాన్ని, కాలుష్యాన్ని బిజెపి వంటి పార్టీలు సైతం వంట బట్టించు కోవడం చాలా విచార కరం. ఇటువంటి అవాంఛనీయ, అప్రజాస్వామిక ధోరణులను ప్రోత్సహిస్తూ, సహిస్తూ వెళ్తే ముందు ముందు రాజకీయాలు ఏ రూపాన్ని ధరిస్తాయో వూహించడం అసాధ్యంగా వుంది.

జమీన్‌రైతు

5.10.1945

వెల: 0-1-6 పేజీలు:8

నెల్లూరుముచ్చట్లు

గాంధి జయంతి

అక్టోబరు 2 తేది భారతా వనికి పుణ్య దినం, జాతీయ పండుగ, ఆనంద దివసం. రైతులు, స్త్రీలు, పిల్లలు, రాచకీయ నాయకులు, సామాన్య ప్రజలు వారు వీర నవేల భారతదేశ మంతా ఒక్క కుటుంబంగా కళ కళ లాడిపోయింది.

నెల్లూర్లో 77 జతల ఎడ్లగట్టిన రధం మీద బాపూజీ పటం నవ్య చైతన్య విలసిత తేజోమయంగా జీవకళలతో వెలిగి పోయింది. ఓ! ఎక్కడి జన సమూహం, ఎక్కడి భక్తి పారవశ్యత!!

శ్రీ కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో గూడా బాలికలు బాపూజీని మాతృశ్రీ కస్తూరి బా సాన్నిధ్యాన నిలిపి సూత్రాంజలితో అపరమ పావమూర్తిని అర్చించి ఆరాధించి, ఆ మహోన్నత గుణగణా లంకారుని పావన చరితమును [illegible]ముల చే కీర్తించి, పుష్పాంజలుల ఘటించిరి. ఆ సాయంత్రం [illegible]వయిత్రి, గాయకురాలు, హరి కథకురాలు శ్రీమతి యర్రంరెడ్డి వెంచు కృష్ణమ్మ గారు స్వవిరచిత ప్రహ్లాద చరిత హరికథను కర్ణ పేయముగ వినిపించి ఆనందింప జేసిరి.

ఇట్లే ఈ వారమంతా పట్టణ, నగర, పల్లెటూళ్లలో సైతము బాపూజీ దివ్య నామ స్మరణోత్సవాలు జరుగు చున్నవి.

అధికార్లు

ఎస్టేటు, రైతుల మధ్య వెంకటగిరి తాలూకాలో ఎన్నో వాజ్యాలు వ్యవహారాలు సాగు తున్నవి. అధికార్లు ఉభయులకు భయంకరులుగా కనపడ వలసిన వారు. కొందరు అధికారులు నగరి వారి ఆతిధ్యాలు స్వీకరించడం, తమ పుట్టిన దిన పండుగ వేడుకలు వారింటనే తీర్చు కోవడం సబబైన పని కాదు. తామెంత భీష్మాచారులైనా, ప్రజలు పామరులు గదా? కావున అట్టి అధికార్ల చర్యలను గర్హిస్తున్నాము.

అది దృశ్య కావ్యం

నటకుడు [illegible] రెడ్డి రాధాకృష్ణా రెడ్డి గారి స్మారక సభలో ఒకటవ తేదిన శ్రీ బెజవాడ గోపాల రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన

50 ఏళ్ళ క్రితం ఈ వారం

సందర్భంలో లలిత కళా నిలయం విశ్వనాధ రెడ్డి, చంద్రబాల యింకి పాటలను కొన్నిటిని 'నన్నిడచి... నారాజా' - 'మనసే పాలు' 'పచ్చని సేలోన..' 'నా ప్రక్క తిరిగి మాటాడవా' 'నాయుడు బావ' అభినయించి అత్యద్భుత దృశ్య కావ్యాన్ని ప్రదర్శించారు. ఆచార్య ఆత్రేయ అట్లే 'పిరదౌసి' రంగ మార్తాండ రాఘవాచారి రామదాసు పక్కిలో నటించి తెలుగు నాటక రంగంలో నూత్న పంధాలు త్రొక్కిరని మా అభిప్రాయం. సిలోహాటి ఏర్పాటు జరిగితే, ఇంకా బాగుంటుంది. కళాభిమానుల ప్రోత్సాహం అత్యవసరం.

కొరప 8 వ పేజీలో

మునిసిపల్ సన్మానం అనుకొంటే సరిపోదా?

నెల్లూరు మునిసి పాలిటీ మునిసిపల్ మంత్రి శ్రీ తమ్మినేని సీతారామ్‌కు జరిపిన పౌర సన్మానం గురించి శ్రీ వి. అనంత రామయ్య గారి అధిక్షేపణ బాగుంది. కానీ అందులో స్వోత్కర్ష, అక్కసు అడుగడుగునా తొంగి చూడటం బాధాకరం. ఆ పౌర సన్మానానికి పుర ప్రముఖుడైన తనకు ఆహ్వానం లేక పోవడం, గతంలో తాను సూచించిన వారికి పౌర సన్మానం జరపక పోవడం అనే కారణాల పై అలక చెంది, ఆగ్రహించి ఆ విమర్శ చేసినట్లు శ్రీ అనంత రామయ్య ఉత్తరంలో "బలీయమైన సాక్ష్యాలు" కనిపిస్తున్నాయి.

మున్సి పాలిటీ వ్యవహారాలతో 52 ఏళ్లుగా ప్రమేయం వున్న తనను గుర్తించ లేదని శ్రీ [illegible]ంత రామయ్య గారు బాధ పడటం స[illegible]హతుకమే! కానీ ఛైర్మన్ల సదస్సు ఏ పరిస్థితులలో, ఏ ఉద్దేశ్యంతో నెల్లూరులో జరిగిందో వారికి తెలియనిది కాదు. తమ అధికారాలు, హక్కులు పునరుద్ధ రించుకోవడానికి పోరాటం ప్రకటించ డానికి జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశం అది. అది కేవలం ఒక అసోసియేషన్ మీటింగ్ వంటిదే అని నా అభిప్రాయం. సామాన్య ప్రజానీకానికి గానీ, పుర ప్రముఖులకు గానీ దీనితో సంబంధం లేదు - ఏ కస్తూరి బా కళాక్షేత్రంలోనో, టౌన్ హాల్లోనో నాలుగు గోడల మధ్య జరగ వలసిన సమావేశాన్ని - ఒక [illegible]రంగ [illegible]దానంలో నలుగురి కళ్లలో పడేటట్లు [illegible]ంగా, సిగ్గిలతో భారీ ఎత్తున జరపడం శ్రీ ఆనం వివేకానంద రెడ్డి స్టయిల్! ఇకపోతే సింహపురి ఆతిథ్యం వివేకాతో వచ్చింది కాదు, పోయేది కాదు! ఆతిధ్య మర్యాదలలో ఏ మాత్రం లోటుపాట్లు వచ్చి వుండినా నెల్లూరు పరువు పెన్నలో కలిపాడని వివేకాను మనమే నిందించి వుండే వాళ్ళం! ఇకపోతే సదస్సులో విలాస, వినోద కార్యక్రమాలు [illegible] నాయనడం అనంత రామయ[illegible] గారి అపోహ మాత్రమే. పోలీస్ బ్యాండ్ కూడా ఒక విలాసమా? రాష్ట్రంలో మున్సిపాలిటీ ఎంత దరిద్రంగా దయనీయంగా వున్నాయో అనంత రామయ్య గారు చక్కగా చెప్పారు. పౌర సన్మానాలు జరిపే స్థితిలో, స్థాయిలో అవి లేవు. కనుక నెల్లూరు జరిగింది మునిసిపల్ సన్మానం అనుకుంటే ఎవరూ నొచ్చు కోవలసిన అవసరం వుండదు.

జనవాణి

నెల్లూరు -తిరుమూరు సుధాకరరెడ్డి

సిఎం నిర్ణయం- రైతులకు అన్యాయం!

ప్రభుత్వం రైతులను ముఖ్యంగా ఆహార ధాన్యాలను పండించే వారిని మరీ హీనంగా, బానిస జాతికి చెందిన మాదిరి చూస్తున్నట్లుంది. ఆరోగ్య మిచ్చే ఆహార ధాన్యాలను పండించే వారి కన్నా కల్లు [illegible] వారికి పూలదండలు వేసి గౌరవిస్తున్నది. ఆహార ధాన్యాలు డిమాండ్‌ను బట్టి రేట్లు మారు తుంటాయి. నూనె 36 రూపాయలు, మినపప్పు 18, కందిపప్పు 22 రూ, పెసర పప్పు 16 రూపాయలకే అమ్మాలనే వార్త ఇప్పటికే పలు రకాలుగా కృంగి పోయి వున్న రైతులను మరింత కృంగ దీయడమే. [illegible]కులు ఈ ధరలను బూచిగా చూపించి అపరాలను రైతుల వద్ద తక్కువ రేట్లకు కొనాలని చూస్తారు. బ్లాక్ మార్కెట్ చేయడం వ్యాపారస్తులకు వెన్నతో పెట్టిన విద్య. ఎంత నిఘా వున్నా కృత్రిమ కొరత సృష్టిస్తారు. ఈ విషయమై శాసన సభలో ఎందరో రైతులు ఎమ్మెల్యేలుగా వున్నా కనీసం ప్రతిఘటించక పోవడం దారుణం. పారిశ్రామిక వస్త్రువుల ధరలు తగ్గించే విషయంలో నిర్ణయం తీసుకొనే దమ్ము ప్రభుత్వానికి లేదు. నీళ్ల పాముల వంటి రైతుల పై పడడం ముఖ్యమంత్రికి తగదు.

కోవూరు -కె. పెదరామయ్య

ఆర్టీసీ బస్సుల్లో ఆచరణలేదు

ఆర్టీసీ బస్సుల్లో ఎక్కిన [illegible] సారీ బస్సుల్లో వ్రాసి వున్న [illegible] చదువుతూనే వున్నాను. [illegible] అర్చి సెల్ఫ్ కొట్టుము. బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో సహా ఎవ్వరూ [illegible]

లక్ష్మీపార్వతిని విమర్శించే జిల్లా ఎమ్మెల్యేలు తమ భార్యలకు పదవులెట్లా ఇచ్చారు?

ఎన్టీఆర్ మద్దతు సభలో వేడి వేడి తిట్ల పకోడీలు!

జిల్లాలో ఎన్టీ రామారావు వర్గానికి మిగిలిన ఏకైక ఎమ్మెల్యే మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార రెడ్డి నాయకత్వంలో 30 తేది జరిగిన తెలుగు కార్యకర్తల సమావేశం విజయవంత మయ్యిందనే చెప్పాలి. జనాన్ని తరలించక రాను ప్రసన్న పడిన కష్టం ఫలించింది; కోట నుంచి లారీలలో తరలించి మరీ టౌన్‌హాల్ నింపారు. జనం నిండుగా కనపడడంతో వేదిక పై ఉన్న నాయకుల ఉత్సాహానికి పట్ట పగ్గాలు లేకుండా పోయాయి. కృష్ణా జిల్లా కంకిపాడు ఎమ్మెల్యే దేవినేని నెహ్రూ చంద్రబాబు, వెంకటేశ్వర రావు హరికృష్ణలను వ్యక్తిగతంగా సూటిగా విమర్శించగా - ప్రసన్నకుమార్ రెడ్డి - రమేష్ రెడ్డి, పోమిరెడ్డి చంద్రమోహన రెడ్డిల పై దుమ్మెత్తి పోశారు. ప్రసన్న, నల్లపరెడ్డి చంద్రశేఖర రెడ్డి, జడ్‌పి నాగభూషణమ్మ, వైటి నాయుడులు తప్ప జిల్లాలో ఆ పార్టీలో పేరున్న చిన్నా, చితకా నాయకులెవరూ పరిసర ప్రాంతాల్లో కనపడలేదు.

దేవినేని నెహ్రూ, తన సహజ ధోరణిలో మాట్లాడుతూ డబ్బు, అధికార దాహంతో తపించే ఎమ్మెల్యేల మద్దతుతో గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు ఎన్ని రోజులు ముఖ్యమంత్రిగా వుంటారో చూద్దాం; ప్రజల మద్దతు తనకు లేదని తెలుసు; అందుకే విచ్చలవిడిగా ధనార్జన చేస్తూ, పత్రికల్లో మాత్రం సంక్షేమ ప్రకటనలు చేసి కాలం వెళ్లబుచ్చాలని చూస్తున్నాడు. రాష్ట్రంలో ముగ్గురు మూర్ఖుల (చంద్రబాబు, వెంకటేశ్వర రావు, హరికృష్ణ) పాలన కొనసాగుతూంది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసిన నెల్లూరులో ఈ మూర్ఖుల పాలన అంత మయ్యేలా ప్రజలు తిరగబడి ఉద్యమించ వాలన్నారాయన. చంద్రబాబుకు దమ్ముంటే హరికృష్ణను ఉప ఎన్నికల్లో గెలిపించు కోవాలని; ఆయన గెలిస్తే తామంతా తమ ఎమ్మెల్యే పదవులు వదులు కొంటామని శపథం చేసారు. మునా మేస్త్రి చేతిలో చంద్రగిరిలో చంద్రబాబు ఓడిపోయాడు. అల్లుడన్న హోదాలో అన్నగారి అక్కున చేరి అధికారాలన్నీ అనుభవించాడు. ఎన్టీఆర్ వద్ద పైరవీ సాగని కొంత మంది ఎమ్మెల్యేలతో జతకలసి నేడు వెన్నుపోటు పొడిచాడు. దానికి మద్దతు ఇవ్వడానికి దగ్గుపాటి హరికృష్ణలకు మనస్సు ఎలా ఒప్పిందో; అందువల్లే ఇటువంటి సంతానం పగవారికి కూడా

కొరవ పేజీలో



తిక్కవరపు సుబ్బరామ రెడ్డి గారి చేతుల మీదుగా, కళాక్షేత్రం అవార్డు స్వీకరిస్తున్న అక్కినేని నాగేశ్వర రావు; కేంద్రమంత్రి బలరాం జక్కర్, పుష్పగిరి పీఠాధిపతి శ్రీ శంకరాచార్య

సణుగుడు

* పెళ్లకూరుకు చిరకీర్తి
* డాక్టర్లనూ ఒక కంట చూడకూడదా కలెక్టర్ గారు?

పెళ్లకూరు రామచంద్రా రెడ్డి గారు ఇంత ఘన కార్యం సాధిస్తారని నాకైతే నమ్మకం లేదు; నాకే కాదు, ఆయన్ను తెలిసిన వారెవరికీ ఆయనలో అంతటి సమర్థత, పట్టుదల, వాకచక్యం వున్నాయన్న విశ్వాసం వచ్చినా ఏర్పడదు. ఆయన రాజకీయ శైలి, మాట తీరు అటువంటివి. ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు పెళ్లకూరు సమర్థత రుజువైంది. జిల్లాలో ఏ రాజకీయ వాదీ జిల్లాకు చేయలేని మహోపకారాన్ని తాను చేయడం ద్వారా తన సమర్థతనే కాక, తన ఘనతనూ చాటుకున్నారు. అందు కాయన్ను అభినందించి తీరాలి.

నెల్లూరు రాజకీయ వాదులలో రామచంద్రా రెడ్డి గారిది విలక్షణ శైలి. ఇప్పటికీ యాక్టివ్‌గా వున్న నాయకు లందరిలోకీ రామచంద్రా రెడ్డి గారు సీనియర్. ఆనం సంజీవ రెడ్డి కంటే కూడా ముందు నుంచి వెలుగులో వున్న వాడు. పాత తరం మనిషి. ఇన్ని దశాబ్దాల నుంచి రాజకీయాలలో వున్నా జిల్లాలో పెళ్లకూరుకు ఒక గ్రూపంటూ ఎప్పుడూ లేదు; ఆనెప్పుడూ ఏ వర్గానికి చెందిన మనిషిగా గుర్తింప బడనూ లేదు. ఒంటెద్దు పోకడ ఆయన నైజం. అట్లని భీరువూ కాదు. ఆనం కుటుంబం రాజకీయంగా అత్యంత ప్రాభవంలో వున్నప్పుడు, వారి-

డోలేంద్ర

నెదిరించి, వారికి దుర్భేద్యమైన కోటల వంటి గ్రామాలలో ప్రవేశం సంపాదించి, ఎమ్మెల్యేగా సవాల్ చేసి మరీ గెల్చిన రాజకీయ సాహసి.

ఆ తర్వాత, తర్వాత ఎందు వల్లో ఆ సాహసం కోల్పోయారు. ఏ విషయాన్నయినా తేలికగా తీసుకోవడం, తేలిక పాటి మాటలతో అనుచరులకు అతి చనువివ్వడం, నమ్మి వచ్చిన వారి

కొరవ 6 పేజీలో

వ్యాపారులకు కలెక్టర్ హెచ్చరిక

పప్పు, ఉప్పులు చెప్పిన ధరకు అమ్మకుంటే భరతం పడతాము!

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ. గిరిధర్ ఆయిల్, దాల్, హోల్‌సేల్, రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులతో ఇటీవల ఒక సమావేశం జరిపించారు. నిత్యావసర వస్తువుల ధర తగ్గుదల విషయమై వారితో చర్చించారు. కందిపప్పు కేజీ 22 రూపాయలు, మినపప్పు 18రూ. పెసరపప్పు 16 రూ. వేరుశెనగ నూనె 36 రూపాయలుగా జిల్లాలో విధిగా అమ్మాలని ప్రకటించారు. ఈ ధరలన్నీ అక్టోబర్ 1 తేది నుంచే అమలులోకి వస్తాయన్న విషయం ప్రజలు గమనించాలన్నా రాయన. ధరలను అతిక్రమించిన వ్యాపారుల విషయమై తనకు స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వారి భరతం పడతానన్నారు. ప్రజలు ప్రొవిజన్ స్టోరు వారి వద్ద బిల్లులు పొందితే బెటరు.

40 కోట్లతో ప్రాథమిక విద్యా కార్యక్రమాలు!

నెల్లూరు జిల్లాలో వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నుండి 40 కోట్ల రూపాయలతో ప్రాథమిక విద్యా కార్యక్రమాలు చేపట్టను అన్ని హంగులూ పూర్తయినట్లు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ. గిరిధర్ చెప్పారు. గాంధీ మహాత్ముని 125 జయంతిని పురస్కరించుకొని ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎ. గిరిధర్, జిల్లా పరిషత్ ఛేర్ పర్సన్ శ్రీమతి ఎం. నాగభూషణమ్మ, నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానంద రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అక్కడే ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్త్రీ జనోద్ధరణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారని, ఆయన బాటలో నడచి నెల్లూరు మహిళలు సంపూర్ణ మద్య నిషేధాన్ని సాధించుకొన్నా, కొన్ని స్వార్థ పర శక్తులు దాన్ని నీరు గార్చడానికి ప్రయత్నిస్తున్నాయని, దీన్ని ఎదుర్కొనేందుకు జిల్లాలోని మహిళలు మళ్లీ వుద్యమించాలన్నారు. జిల్లా పరిషత్ ఛేర్ పర్సన్ శ్రీమతి నాగభూషణమ్మ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జన్మ దినోత్సవాన్ని మద్య నిషేధ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయ మన్నారు. మునిసిపల్ ఛైర్మన్

నెల్లూరు సంగతులు

ఆనం వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి మార్గం చూపిన ప్రవక్త మహాత్మా గాంధీ అన్నారు. సభకు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎ. రఘురామ్ అధ్యక్షత వహించారు. తొలుత పట్టణంలోని కస్తూరిదేవి ఉన్నత పాఠశాల నుంచి గాంధీ విగ్రహం వరకు శాంతి యాత్ర నిర్వహించారు. అనంతరం సుబేదారుపేట బాలుర వసతి గృహంలో సమాచార పౌరసంబంధ శాఖ గాంధీ జీవిత చరిత్ర పై ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శనను డాక్టర్ నాగభూషణమ్మ ప్రారంభించారు.

ఎస్‌విజిఎస్ కాలేజిలో ప్రైవేటు క్లాసులు

ట్యూషన్ల వ్యతిరేక వుద్యమం పుణ్యమా అని ప్రైవేట్ క్లాసులకు వేణు గోపాలస్వామి డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 10 నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం సాయంత్రం కళాశాలలోనే వీటిని నిర్వహిస్తారట. కామర్స్ ఆర్.వి.ఎస్. ప్రసాద్, అకౌంట్స్ బాబూరావు, మ్యాథ్స్ శ్రీనివాసులు రెడ్డి, ఇంగ్లీషు కృష్ణార్జున రెడ్డితో పాటు పి.యం.వి. ప్రసాద్, వి. రామకృష్ణయ్య, కె.ఎన్. గాయత్రి, పి. శ్రీధర్ రెడ్డి వారి

కొరవ 8 పేజీలో

కాలాన్ని బట్టి భాష మారుతూంది!

వర్తమాన సమాజం ఆధ్వర్యాన అక్టోబర్ 2తేది టౌన్‌హాల్‌లో శ్రీనాథ జయంతి సభ డాక్టర్ బెజవాడ గోపాల రెడ్డి అధ్యక్షతన జరిగింది. డాక్టర్ గోపాల్‌రెడ్డి గారు మాట్లాడుతూ తెలుగు భాషలో కవిత్రయం తరువాత శ్రీనాథ కవిసార్వ భౌముడు ఆంధ్ర నైషధం వంటి గ్రంథ రచనలు చేసి ప్రబంధ కవితా వికాసానికి మార్గ దర్శకుడైనాడు. ఆనాటి ప్రబంధాలలోని తెలుగు భాషకు ఈనాడు తెలుగు దేశంలో వాడుతున్న భాషకు ఎంతో తేడా వుంది; ఆనాటి భాషకు ఆలంబనం మహాకవి పండితుల కావ్యాలు, ప్రబంధాలు కాగా, ఈనాటి భాషను పత్రికలు ప్రచారం చేస్తున్నాయి; కాలాన్ని బట్టి భాష మారి పోతున్నట్లు ఆవేదన వ్యక్త పరిచా రాయన; ప్రాచీన గ్రంథాలను సంరక్షించు కోవాల్సిన తరుణం ఆసన్న మైందన్నారు. ముఖ్య ఉపన్యాసకులుగా విచ్చేసిన మద్రాసు విశ్వ విద్యాలయం ఆంధ్ర శాఖాధ్యక్షులు ఆచార్య వి. రామచంద్ర చౌదరి మాట్లాడుతూ బ్రాహ్మీదత్త వర ప్రసాదుడు, ఈశ్వరార్చన కళాశీలుడైన శ్రీనాథ కవిలో రాజస గుణం అనుపదంగా కనపడుతుంది. వేమారెడ్డి ఆస్థానంలో సర్వాధికారియైన శ్రీనాథుడు పలు రాజస్థానాలు సందర్శించి; విద్వత్సభలల రచనలు చేసి, శాస్త్ర పాండితీ వైశారద్యంలో కవి పండితులను ఓడించి కనకాభిషేకాలు, గౌరవాలు

శ్రీనాథ జయంతి

పొందినట్లు చెప్పారు. అసాధారణమైన రీతిలో అలవోకగా శ్రీనాథుడు చెప్పిన చాటు పద్యాల ఆధారంగా ఆనాటి ఆంధ్రావనిలోని జన జీవనం తీరు తెలుసు కోవచ్చు. లలితమైన భాష, రమణీయమైన భావాలు, రసప్లావితమైన రచన, భక్తి భావ బంధురమైన కళాశీలత్వం శాస్త్ర పాండితీ వైభవం కల్గిన శ్రీనాథుడు కవితా యుగ కర్తగా శ్లాఘించారాయన. అనంతరం కీర్తిశేషులు వై.బి. రెడ్డి దౌహిత్రులు సుమతి - నరేంద్ర ఉచిత రీతిన ఉపన్యాసకుని సత్కరించారు. ఉపన్యాసకుని అగస్త్యరెడ్డి వెంకురెడ్డి సభకు పరిచయం చేసారు. వర్తమాన సమాజం కార్యదర్శి బి.వి. నరసింహం వందన సమర్పణ చేసారు.

పట్టణ మహిళా కాంగ్రెస్- గాంధీ జయంతి

జాతిపిత గాంధీ మహాత్ముని 125వ జయంతిని పట్టణ మహిళా కాంగ్రెస్ ఘనంగా జరిపింది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్లపల్లి అరుణమ్మ నాయకత్వంలో 100 మంది కార్యకర్తలు బాలాజీ నగర్ నుంచి ప్రదర్శనగా ఇందిరాభవన్ చేరారు. అక్కడ జాతిపిత శైలవర్ణ చిత్రానికి పుష్పమాలలు సమర్పించి, నివాళు లర్పించి, గాంధీ బొమ్మ వద్దకు ప్రదర్శనగా వెళ్లారు. గాంధీ కలలుగన్న సంపూర్ణ మద్య నిషేధాన్ని విజయ వంతం చేయాలని మహిళా కార్యకర్తలు ఈ సందర్భంగా [illegible]

...మా అభిప్రాయం ఇటువంటి క్రమశిక్షణ కల్గిన పిల్లాడీ మొత్తం భారత దేశం లోనే లేడు--- అదే నాకు గర్వకారణం!!

గుజరాత్ బిజెపి లో సంక్షోభం

సణుగుడు

4 పేజీ తరువాయి

అవసరాలు తీర్చ లేక పోవడం ప్రక్కన పెట్టి సాగితే వాడు. అతి వినయం ప్రదర్శించే వాడే తనకు నమ్మిన బంటని తాను నమ్మడం; అనుచరులలో సమర్థులను గుర్తించి ప్రోత్సహించ లేక పోవడం వన్ను పట్టి రాజకీయ పోరాటాలు జరప లేక పోవడం. ఏ పనీ చేపట్టక పోవడం, చేపట్టినా సీరియస్‌గా ప్రయత్నించి సాధించక పోవడం పెళ్లకూరు బలహీనతలు. ఇంకొక నాయకుడి దగ్గరకు వెళ్లకుండా బెట్టు కాపాడు కొంటాడు కాని, ఇతర నాయకులతో సమంగా ఎదగాలనే పట్టుదల, ప్రయత్నం ఆయనలో వుండవు. వీటన్నింటి వల్లా పెళ్లకూరు క్రమ క్రమంగా రాజకీయ అస్తిత్వం కోల్పోయారు. వచ్చిన అవకాశాలూ చేజార్చు కున్నారు. అయితే ఆయన రాజకీయ జీవితం మాత్రం నిష్కళంక మైనది. అధికారంలో వున్నప్పుడు, లేనప్పుడు కూడా అవినీతి పరంగా ఒకరి చేత వేలెత్తి చూపించుకునే పరిస్థితి ఎప్పుడూ తెచ్చుకోలేదు. ఏనాడూ కక్కుర్తి పడలేదు. వ్యవసాయం ఆయన వృత్తి అయితే రాజకీయం ఒక వ్యాపకం మాత్రమే. భూమిని నమ్మే సిసలైన రైతు రామచంద్రా రెడ్డి. తానిప్పుడు ఢిల్లీ స్థాయికి ఎదిగినా, ప్రధాన మంత్రితో తలచి నప్పుడల్లా ముచ్చట్లాడే చనువు పొందినా ఆ రైతు ప్రవృత్తే ఆయన్ను ఆడంబరాలకు, భేషజాలకు దూరంగా వుంచు తున్నది. వ్యక్తిగా కూడా రామచంద్రా రెడ్డి గారు సచ్ఛీలుడు. ఆయనకు ఏ దురలవాటూ లేదు; ఏ వ్యసనానికి బానిస కాదు; పూర్తి శాకాహారి; సతత ఖద్దరు ధారి; విలాసాల పై ఏ మాత్రం మోజు లేదు; ధన వ్యామోహం అసలే లేదు; మిత భాషణం ఒక్కటి వుండి వుంటే, సత్య వచన వ్రత మాచరించి వుండే స్వామీజీలతో పోల్చదగిన దినచర్య ఆయనది.

ఇప్పటి రాజకీయాలలో ఇటువంటి ఆలోకికులు మనుగడ సాగించడం మహా కష్టం; పివి నరసింహ రావు గారి దయవల్ల ఇంకా రాజకీయ జీవితం గడప గల్గుతున్నా రనాలి.

పెళ్లకూరుకున్న మరొక విశేష గుణం - విధేయత ఎప్పుడు, ఎక్కడ, ఎందువల్ల ఆయనకు పివి నరసింహ రావుతో పరిచయం ఏర్పడిందో కాని, ఆనాటి నుంచి నేటి వరకు వారి మైత్రి చెడలేదు. పివి రాజకీయంగా వెలుగులో వున్నా, అజ్ఞాతంలో గడిపినా పెళ్లకూరు ఆయన్ను వదలి పెట్టలేదు. గత ముప్పయ్యేళ్లలో పెళ్లకూరుకు పివి చేసిన వుపకార మంటూ ఏదీ లేదు. కానీ, ఆయన్ను వదలి పెట్టలేదు; వేరే ఆలోచనలు చేయలేదు. ఇప్పటి రాజకీయ వాదులలో ఎవరి కుంది ఇంత ఓపిక, విధేయత? ముప్పయ్యేళ్ల పాటు సేవించిన దానికి ఇప్పుడు మేలు జరిగింది పెళ్లకూరుకు. ఇఫ్కో ఛైర్మన్ పదవి ఆయనకు పెద్ద సత్కారమే

తనకు లభించిన పదవీ సత్కారాన్ని తన స్వంత లాభం కోసం కాకుండా, జిల్లా మేలుకు వుపయోగ పెట్టడం పెళ్లకూరు అంతస్తును పెంచింది. నెల్లూరుకు ఎరువుల కర్మాగారం తరలించుక రాగలడని ఎవరూ భావించ లేదు. కానీ తెచ్చాడు. పట్టు బట్టి సాధించాడు. రేపో ఎల్లుండో శంకుస్థాపన జరిపించ నున్నారు. ఢిల్లీలో, హైదరాబాదులో కూడా స్వయంగా సంబంధిత ఉన్నతాధి కారులను కలిసి కావలసిన అనుమతులన్నీ తెచ్చాడు. ఇది తన స్వంత ఫ్యాక్టరీ అన్నట్లు పనిచేశాడు. ఈ వయస్సులో ఆయన కంత ఓపిక ఆశ్చర్యమే కదా?

జిల్లాకు చెందిన మరే ఇతర నాయకుడూ జిల్లా పారిశ్రామి కాభివృద్ధి గురించి పట్టించు కోలేదు; శ్రద్ధ చూపలేదు. పెళ్లకూరుతో మొదలౌ తున్నదది. నాలుగు వేల మందికి ఉపాధి కల్పించే ఈ కృషి వూరకే పోదు; ఆయనకు చిరకీర్తిని సముపార్జించి పెడుతుంది.

* * *

నెల్లూరులో ట్యూషన్లపై కలెక్టర్ గిరిధర్ సాగించిన సమరం చాలా వరకు విజయ వంతమైనట్లే లెక్క. పెళ్లకూరు రవీంద్ర రెడ్డి వంటి ఒకరిద్దరు తప్ప ట్యూషన్ల గురించి మాట్లాడడానికి భయపడు తున్నారు. విద్యార్థులలోనూ చైతన్యం వచ్చింది. ఇదే పట్టుదలతో నెల్లూరులోని ప్రభుత్వ డాక్టర్ల వైపు కూడా ఒక కన్ను వేయ గల్గితే కలెక్టర్ గారిని జిల్లా ప్రజలు మెచ్చు కుంటారు.

ట్యూషన్ల వలెనే - అంత కంటే ఎక్కువేమో కూడా - డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసూ సమాజానికి కీడు చేసేదే! నిజానికి, ఆస్పత్రిలో, బయట కూడా డాక్టరు తన నైపుణ్యంతో రోగులకు ప్రాణ దానం చేయడం ఆక్షేపించ దగిన విషయం కాదు. కానీ డాక్టర్లు ప్రభుత్వాస్పత్రులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, జీతాలు మాత్రం తీసుకొంటూ, తమ స్వంత నర్సింగ్ హోంల పర్యవేక్షణలోనే కాలం గడపడం ఘోరమైన అపచారం. డాక్టర్ల నిర్లక్ష్యం, ధనాశ వల్ల ప్రభుత్వా స్పత్రులనే నమ్ముకొని వచ్చే పూట గడవని నిరుపేదలు దారుణమైన అన్యాయానికి గురౌతున్నారు. అన్యాయంగా ప్రాణాలు పోగొట్టు కొంటున్నారు.

లెక్చరర్ కంటే డాక్టరుకు సామాజిక బాధ్యత ఎక్కువ. డాక్టర్ తప్పు చేస్తే దాని ప్రభావం తక్షణమే కన్పిస్తుంది; ఒక నిండు ప్రాణం హరీ మంటుంది. అందువల్ల ప్రభుత్వం వారి కంతంత జీతాలు, అన్నన్ని సౌకర్యాలు కల్పించేది. వీటన్నింటినీ అనుభవిస్తూ కూడా డాక్టర్లు ఆస్పత్రులు వదలిపెట్టి తిరగడం క్షమించ రాని నేరం.

కల్లితూర్లలోని పిహెచ్‌సిలలో, ఈ దుర్మార్గం మరీ వికృతంగా చలామణి అవు తుంటుంది. టౌన్‌లలో కాపురాలుండే డాక్టర్లు వారాని కొకసారి కూడా వాటి ముఖం చూడరు; తమ స్వంత క్లినిక్‌లలో కాలం గడుపు తుంటారు. ఇలాంటి వైద్యులనూ సంఘ విద్రోహులుగా గుర్తింప జేసి, వారి పై ఒత్తిడి తెచ్చి విధిగా ప్రభుత్వ డ్యూటీ చేసేటట్లు ఒక చిన్న ఉద్యమం నడపడం బాగుంటుంది. కలెక్టర్ గారే అందుకు పూనుకోవడం మేలు.

నెల్లూరు ముచ్చట్లు

5 పేజీ తరువాయి

నిర్వాహకులు స్వామి కమలా నందజీ రామకృష్ణ వివేకా నందుల ప్రబోధాల ప్రభావం పై మాట్లాడారు. కళ్యాణి ఫిలింస్ ప్రసన్న కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెకె రెడ్డి, గూడూరు దివ్య జ్ఞాన సమాజం అధ్యక్షులు శ్రీ సిహెచ్ వెంకట శేషయ్య ప్రసంగించారు. నెల్లూరు మిషన్ నిర్వాహకులు శ్రీ ఎస్‌వి నరసింహా రావు (శారదా కుమార్) నివేదిక సమర్పించారు. శ్రీ కొం బలరామ రెడ్డి స్వాగతం, శ్రీ టిఎల్ నారాయణ రావు వందనాలు చెల్లించారు.

ధూమ పానం పై లయన్స్ దండయాత్ర

నెల్లూరు లయన్స్ క్లబ్, మాదరన్ స్కూల్ యజమాని శ్రీ వాకాటి విజయ కుమార రెడ్డి కలిసి నెల్లూరులో ధూమ పానం పై దండయాత్ర ప్రారంభించారు. ఇందుకు ప్రారంభంగా అక్టోబరు 2 తేదీ గాంధీ జయంతి సందర్భంగా పిల్లలకు వ్యాస రచన పోటీలు జరిగాయి. రైళ్లలో, బస్సులలో పొగ త్రాగకుండా ప్రజలు అభ్యంతరం చెప్పాలని; పబ్లిక్ ప్రదేశాలలో ధూమ పానం నిషేధించాలని, ఇళ్లలో సిగరెట్లు త్రాగడాన్ని మహిళలు నివారించాలని వీరు ప్రచారం చేయబోతున్నారు. పొగ త్రాగడం వల్ల కలిగే అనర్థాల మీద వీరు ప్రచార యుద్ధం ప్రారంభిస్తారట.

చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

మార్చి పోస్తున్నారు. ఇద్దరి మధ్య రోజుకు కనీసం నాలుగైదు సార్లు సంభాషణలు, చర్చలు జరుగు తున్నాయి. వెంకటేశ్వర రావుకు ఉప ముఖ్యమంత్రిత్వం ఇవ్వడాన్ని రామోజీ రావు వ్యతిరేకించడం వల్లే ఆయనంత పట్టుదలగా వుండ గల్గుతున్నాడని వినికిడి. మంత్రిత్వా లాశించే పదేవిమిది మంది ప్రముఖ కమ్మ ఎమ్మెల్యేల విషయంలో చంద్రబాబు మరీ జటిలమైన సమస్య నెదు ర్కొంటున్నారు. వారికి పదవులిస్తే తన ప్రభుత్వం పై కులం ముద్ర పడుతుంది; ఇవ్వకుంటే వారు మరింత మందిని తోదు తీసుకొని వెళ్లి పోతారని భయం.

ఏది ఏమైనా చంద్రబాబులో రాష్ట్రాధినేత నయ్యానన్న సంతోషం కన్పించడం లేదు. నంబర్ టు స్థానంలోనే ఆయన బలంగా కన్పించే వారు.

పెరుగుదల

2 పేజీ తరువాయి

సంస్థలు, పెద్ద బ్రోకర్లు మార్కెట్ పరిస్థితి మెరుగు పడవచ్చు అనే సాకుతో టెంపోరరీ ర్యాలీ సృష్టిస్తారు. దీనివల్ల విఎస్‌యుల షేర్ల విలువ పెంచు కోవడానికి, రాజకీయ పార్టీలకు ఎన్నికల నిధులు సమకూర్చ డానికి వీలౌతుంది. ఈ టెంపోరరీ ర్యాలీ సమయంలో తెలివి గల వాళ్లు ప్రాఫిట్ బుకింగ్ చేసి చేతులు కడుక్కుంటారు.

విదేశీ సంస్థలు, ప్రొఫెషనల్ ఇన్వెస్టర్లు సెకండరీ మార్కెట్‌లో అంతగా పెట్టుబడి పెట్టక పోవడాన్ని మనమిక్కడ గమనించాలి. వీరు పార్లమెంట్ ఎన్నికల తీరు, ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. 94 సెప్టంబరు ప్రాంతంలో వీరు మార్కెట్‌లో కొన్న షేర్ల విలువ ఇప్పుడు 30 నుంచి 50 శాతం వరకు పడిపోయి వుంది. అందువల్లే వారంత జాగ్రత్తగా వున్నారు. విదేశీ సంస్థలే ఆచి తూచి అడుగేస్తున్నప్పుడు సగటు ఇన్వెస్టరు తొందర పడడం ఎంత ప్రమాదకరమో ఆలోచించాలి.

పార్లమెంట్ ఎన్నికలు 1996 మార్చిలో జరుగు తాయని అంచనా. అందువల్ల కనీసం అప్పటి వరకు వేచి వుండడం మంచిది. ఆ రోజు దేశంలో నెలకొనే రాజకీయ పరిస్థితులు, రాజకీయ సుస్థిరత, ద్రవ్యోల్బణం తీరు, రూపాయి మారకం విలువ, కంపెనీల ఆర్థిక ఫలితాలు చూసి ఆ తర్వాత షేర్లు కొనుగోలు చేయడం మంచిది. ఈ లోపల ప్రైవేటు మ్యూచ్యువల్ ఫండ్స్‌లో సైతం పెట్టుబడి పెట్టడం వ్యర్థం. ఒక్క రిలయన్స్ తప్ప తక్కిన ఏ ప్రైవేట్ మ్యూచ్యువల్ ఫండ్‌లోనూ పెట్టిన పెట్టుబడికి సరైన విలువ రాలేదు. వీటిలో రు. 10 ల షేర్ కొన్న రోజే 6 శాతం కమీషను పోతుంది. అంటే దాని విలువ రు. 9.40 లకు చేరుతుంది. లిస్ట్ అయ్యేటప్పటికి అవి రు. 8.50 ల స్థాయికి పడి పోతున్నాయి.

- డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్

పదవులు

మొదటి పేజీ తరువాయి

సంక్షోభాల నుంచి రాజకీయ లాభాలు పొందాలంటే రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌కు సమర్థ వంతమైన నాయకత్వం కావాలి. అది లేకుండా ఎన్నికలు ఎదుర్కొంటే కాంగ్రెస్ భవిష్యత్తు మళ్ళ చింపిన విస్తరే!

దగ్గుపాటి

మొదటి పేజీ తరువాయి

భావిస్తున్నారు. ఇందు కోసం తన భార్య శ్రీమతి పురంధరేశ్వరి ద్వారా ఎన్‌టిఆర్‌ను కదిలించి చూశారట. సానుకూలమైన ప్రతిస్పందనే వచ్చింది. శ్రీమతి పురంధరేశ్వరి ఇప్పుడు అమెరికాలో వున్నారు. ఒకటి రెండు రోజులలో ఆమె ఇండియాకు తిరిగి రాగానే మామ గారికి దూతగా రాయబారం పంపాలని నిర్ణయించు కున్నారట. ఈ రాయబారానికి లక్ష్మి పార్వతి కూడా ఒకె చెప్పిందని వినికిడి.

వెంకటేశ్వర రావు ఎటు వెళ్తే, అటు అనుసరించ డానికి 10 మంది వరకు ఎమ్మెల్యే లున్నారు. వీరు కాక చంద్రబాబు నుంచి మంత్రిత్వాలు పొందలేని మరి పది, పదిహేను మంది వరకు పెద్దల్లుడి పంచ చెంగు పట్టుకొని వెళ్ల వచ్చునని అంచనా. తిరుగుబాటు సమయంలో చివరి నిముషం వరకు ఎన్‌టిఆర్ కన్న వుండి, ప్రమాణ స్వీకారం సమయానికి చంద్రబాబు గూటికి చేరిన లక్ష్మీపార్వతి మాజీ భజన బృందం సుమారు 30 మంది వరకు వున్నారు. వారెవ్వరికీ ఏ మాత్రం ఆదరణ లభించడం లేదు. చంద్రబాబు అనుచరులు వారిని రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారు. ఎట్టి పరిస్థితులలోనూ చంద్రబాబు తనకు పదవి లివ్వడు; ఇక్కడే వుంటే ఆ తర్వాత ఎన్‌టిఆర్ దగ్గర టిక్కెట్లు దొరకవు; చంద్రబాబును నమ్ముకొని ఎన్నికల్లో గెలవడం అసాధ్యం. అందువల్ల వారూ మెల్లగా వెంకటేశ్వర రావును అర్థం పెట్టుకొని ఎన్టీఆర్ శరణు వేడాలన్న ఆలోచనలో వున్నారు. ఈ అన్ని వర్గాలు వారిని కలిపితే, ఇంచు మించు 50 మంది వరకు ఎమ్మెల్యేలు దగ్గుపాటిని అనుసరించే పరిస్థితి కన్పిస్తున్నది. అందులో ఆయన విజయం సాధిస్తే చంద్రబాబుకు పెద్ద దెబ్బే. వెంకటేశ్వర రావు ఆలోచనలు పసిగట్టి, దువ్వడానికి ప్రయత్నించి, ఉప ముఖ్యమంత్రిత్వం ఇవ్వడానికి చంద్రబాబు సిద్ధపడే అవకాశం వుంది. ఆ పదవి వస్తుందన్న గ్యారంటీ కన్పిస్తే వెంకటేశ్వర రావు పునరా లోచనలో పడినా ఆశ్చర్యం లేదు.

నెల్లూరు నలుచెరగుల్లో

విమర్శకుడు

జనార్ధనరెడ్డి

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్ధన రెడ్డి ఈ రోజు (6 తేది) నెల్లూరు వచ్చారు. ఈ రోజంతా గూడూరులో కార్యక్రమాలు. రేపు (7 తేది) తిమ్మాజి కంద్రిగ, వెంకటగిరి; ఎల్లుండి (8 తేది) ఉదయం నెల్లూరు వస్తారు. సాయంత్రం వరకు ఇంట్లోనే వుండి కార్యకర్తలతో సంభాషిస్తారు. 9 తేది ఉదయం తిరుపతి మీదుగా హైదరాబాదు వెళ్తారు.

దేగా రాజ్యసభ ఆశ

మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ దేగా నారసింహా రెడ్డి గారికి రాజ్యసభ సభ్యుడు కావాలన్న ఆశ కల్గిందట. ఎందువల్లో దాన్ని మనసులో దాచుకోలేక బయటకు చెప్పేశాడు; అదీ పత్రికల వాళ్లతో!

నారసింహా రెడ్డి గారు తెలుగు దేశంలో సీనియర్. ఎన్‌సి తర్వాత జిల్లాలో తానుగా వుండినాడు. కానీ ఎన్‌టిఆర్ ఆయనకు గుర్తింపు ఇవ్వలేదు. ఎమ్మెల్యే టిక్కెట్ల పంపకంలోనే నిరాశ పరిచాడు. చివరలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరి ఇచ్చినా, దేగా సంతృప్తి పడలేదు. చంద్రబాబు తిరుగుబాటు సమయంలో మంచి చెడూ ఆలోచించ కుండా ముందుగా మద్దతు పలికాడు. వైస్రాయ్ హోటల్‌లో శిబిరం పర్యవేక్షించాడు. తాను సాహసించి తీసుకున్న నిర్ణయానికి చంద్రబాబు తనను సముచిత రీతిలో సత్కరించక పోతాడా అన్నది దేగా ఆశ. ఆ సత్కారం రాజ్యసభ అయితే బాగుంటు నన్నది కోరిక.

ఎందువల్లనో దేగాకు మొదటి నుంచి ఎమ్‌పి పదవి పై మోజు. గత ఎన్నికల్లో ఒంగోలు నుంచి మాగుంట సుబ్బరామ రెడ్డిని ఢీ కొని చేతులు కాల్చుకున్నాడు. మళ్లీ పోటీ చేసే ధైర్యం లేదు. రాజ్యసభ అయితే పేచీ వుండదు కదా?

దేగా కోరిక తీరుతుందనే ఆశిద్దాం!

రమేష్‌రెడ్డికే మంత్రిత్వం?

జిల్లా మంత్రిత్వ విషయంలో రెండు వారాల క్రితపు వూహాగానమే ఇప్పటికీ సజీవంగా వుంది, మార్పు లేదు. చంద్రబాబు మంత్రి వర్గ విస్తరణ చేస్తే, గిస్తే; అందులో నెల్లూరుకు ఛాన్సు వుంటే, గింటే, అది రమేష్ రెడ్డినే వరిస్తుంది. ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల మద్దతు రమేష్‌కు నిలకడగా లభిస్తున్నది.

సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి నెక్ట్స్ ఛాన్స్ కోసం ఎదురు చూడక తప్పదను కుంటాము.

వంటేరు జోరు

చంద్రబాబు తెలుగు దేశం రాష్ట్ర కార్యవర్గంలో కావలి, శ్రీ వంటేరు వేణుగోపాల రెడ్డికి స్థానం దొరికింది. శాసన సభ ఎన్నికల్లో ఓడిపోయి నప్పటి నుంచి రాజకీయ నుతి తీరిక, స్థానిక తెలుగు నాయకులతో పొత్తు కుదరక తపన పడ్తుండిన వేణుగోపాల రెడ్డి గారికి, దాహంలో వున్నప్పుడు ఐస్ నీళ్లు దొరికి నంత ఆనందంగా వుంది. అందులోనూ జిల్లా నుంచి ఎంపికైన ఏకైక నాయకుడు తానే కావడంతో తనకు తగిన గుర్తింపు దొరికిందని సంతోష పడ్తున్నాడు. ఆ ఆనందంలో మహా జోరుగా వున్నారు. కావలిలో అప్పుడే చిరు సన్మాన సభ కూడా జరిగి పోయింది.

సిటీ కేబుల్- ఆకాష్ టివి వివాదం

నెల్లూరులో డిష్ యాంటెన్నాల ద్వారా టివి కార్యక్రమాలు ప్రసారం చేసే విషయంలో ఆకాష్ కేబుల్ టివి నిర్వాహకులు తమను అనవసరంగా వేధిస్తున్నారని సిటీ కేబుల్ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో స్థానిక స్థాయిలో కూడా పోటీ, ఘర్షణ ప్రారంభమై నాయన్నమాట.

సిటీ కేబుల్ జాతీయ స్థాయిలో నడిచే "జీ టివి" నిర్వహణలోని సంస్థ. ఆకాష్ కేబుల్ శివ కుమార్ రెడ్డి అనే నెల్లూరు యువకుడు స్వంతంగా నడుపుతున్న చిరు సంస్థ. వయస్సులో, అనుభవంలో చిన్న వాడైనా, శివకుమార్ నెల్లూరు టౌన్ వరకు కేబుల్ నెట్ వర్క్‌ను జన రంజకంగా నిర్వహిస్తున్నాడు; అందువల్ల డిష్ ఆపరేటర్లలో అధిక భాగం ఆకాష్‌కు అనుబంధి తులైనారు. సిటీ కేబుల్ టివి వస్తే తమ పొట్ట గొడ్తారని డిష్ ఆపరేటర్ల భయం. ధన పరంగా అది బలీయమైన సంస్థ కదా? పైగా వారి సర్వీసు వాడితే ప్రతి ఆపరేటరూ ప్రతి కనెక్షన్‌కు రుసుం చెల్లించాలి. కానీ ఆకాష్ కేబుల్ సంస్థ వారికి ఉచిత సర్వీసు ఇస్తున్నది. టెక్నాలజీలో ఇద్దరూ ఒకటే. ఏళ్ల తరబడి ఈ వృత్తి పై ఆధారపడి బ్రతుకుతున్న తమను వదలి వెళ్లి పొమ్మని డిష్ ఆపరేటర్లు సిటీ కేబుల్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్నారు. టౌన్‌లో మొత్తం 58 మంది ఆపరేటర్లుంటే 54 మంది ఈ ధర్నాలో పాల్గొంటున్నారట.

ఇది కేవలం వ్యాపార పోరాటమైనా, కేబుల్ టివికున్న బలవత్తరమైన ప్రచార మహిమ వల్ల టౌన్‌లో ప్రజలందరూ వీరి పోటీని ఆసక్తిగా తిలకిస్తున్నారు. మల్టీ నేషనల్ కంపెనీలకు అటువంటి ప్రసార సాధనాలు దఖలు పరచడం కంటే, స్థానికులను ప్రోత్సహించడమే మేలు కదా?

దువ్వూరు రామిరెడ్డి శతజయంతి

కవికోకిల శ్రీ దువ్వూరు రామిరెడ్డి శత జయంత్యుత్సవం నవంబరు 11 తేది ఘనంగా జరిపించాలని డాక్టర్ బెజవాడ గోపాల రెడ్డి గారి అభిలాష. అంతర్జాతీయ స్థాయి ప్రతిభ కల్గిన బహుముఖ ప్రజ్ఞా ధురీణుడైన దువ్వూరు రామిరెడ్డిని ఆయన పుట్టిన నెల్లూరు సముచి రీతిలో సంస్మరించడం లేదన్న అసంతృప్తి చాలా మందిలో వుంది. ఆ కొరతను తీర్చడానికి ఈ శత జయంతి సందర్భాన్ని వినియోగించాలన్నది గోపాలరెడ్డి గారి కోరిక. ఈ ఉత్సవాలను ఏ తీరులో జరిపిస్తే బాగుంటుందో సలహా ఇవ్వడానికి 8 తేది సాయంత్రం టౌన్ హాల్లో తాము ఏర్పాటు చేస్తున్న సన్నాహక సమావేశానికి సాహిత్యాభిమానులందరూ తరలి రావాలని ఆహ్వానిస్తున్నారు - దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి కార్యదర్శి శ్రీ అగస్త్యరెడ్డి వెంకురెడ్డి; సాహిత్యాభిమానులే కాదు, టౌన్‌లోని సంపన్నులు కూడా తలా ఒక చేయి వేసి ప్రోత్సహించ వలసిన సత్కార్యం ఇది.

రామకృష్ణ మిషన్ భవన నిర్మాణం

నెల్లూరులో రామకృష్ణ మిషన్‌కు ఒక భవనం ఏర్పర్చే ప్రయత్నం ప్రారంభమైంది. పొగతోటలో ఈ భవనం నిర్మించ నున్నారు. ప్రస్తుతానికి, స్థలం చిన్నది కాబట్టి రెండంతస్తులు నిర్మించి క్రింద బాలాజీ గ్రంథాలయం, పైన రామకృష్ణ మందిరం నిర్వహిస్తారు. ఎవరైనా వదాన్యులు స్థలం దానం చేస్తే, దీన్ని పూర్తిగా శ్రీరామకృష్ణులకి అంకితం చేసి, విశాలమైన మందిరం నిర్మించాలన్న అభిలాష నిర్వాహకులలో వుంది.

అక్టోబరు 4 తేది, కోయంబత్తూరుకు చెందిన స్వామి తన్మయానందాజీ భవనానికి శంకు స్థాపించారు. సాయంత్రం టౌన్ హాల్‌లో సభ జరిగింది. మద్రాసు మిషన్

కొరవ 6 పేజీలో

ప్రాణాలు తీయనున్న కల్తీ కల్లు ప్రవాహం!

సారాలేని కొరత కల్లు తీరుస్తూంది. పల్లెల్లో కల్లు పేరిట కటిక విషపు నీళ్లు యథేచ్ఛగా సరఫరా అవుతున్నాయి. ఎంత కావాలంటే అంత, ఎప్పుడు కావాలంటే అప్పుడు కల్లు లభ్యమౌతూంది. అమాయక గ్రామీణులు నిషా కోసం దీని వైపుకు ఎగబడు తున్నారు. జనం ఎగబడే కొద్దీ కల్లు సరఫరా పెరిగి పోతూంది; అమ్మకాలూ పెరుగు తున్నాయి. అయితే ఎక్కడి నుంచి వస్తుంది కల్లు? తాటిచెట్లు, ఈంతాయి చెట్ల నుంచి తీయడానికి అన్ని చెట్లు జిల్లాలో వున్నాయా? వుంటే మాత్రం ఏడాది పొడుగునా కల్లు నివ్వడానికి తాటి చెట్టేమైనా మెషినా? దానికొక అదును వుండదా? తెగలు పూరే కాలంలో తాటి చెట్టు నుంచి కల్లెట్లా గీస్తున్నారు? గీయకుండా కల్లు ఎట్లా వస్తున్నది?

ఈ తిరకాసుకు సమాధానం అందరికీ తెలుసు; కల్లు - చెట్ల నుంచి కారడం లేదని, కుండల్లోనే పూరుతున్నదని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయినా ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. ఎవరూ పట్టించు కోవడం లేదు. క్లోరల్ డీ హైడ్రేట్ వంటి విషపూరిత రసాయనాలు కలిపి విచ్చలవిడిగా కల్లు తయారు చేస్తున్నారు. అది నిషిద్ధ రసాయనం. అమితమైన మత్తు కల్గించే పదార్థం. అయినా కల్లు వ్యాపారులకు అది చాలా సులభంగా లభ్యమౌతున్నది. ఈ లింకు తెగ్గొట్టనిదే కల్లు ప్రవాహం ఆగదు. అది ఆగకుంటే కల్లు చావులూ తప్పవు. స్లో పాయిజన్ వలె ఈ కల్తీ కల్లు కొద్ది కొద్దిగా ఆరోగ్యం హరించి, రోజులు గడిచే కొద్దీ శారీరకంగా కృంగదీసి, మానసికంగా మత్తుకు బానిసలను చేసి చంపేస్తుంది; ప్రాణాలు తీస్తుంది.

రామారావు గారు కల్లును ఎక్సైజ్ పరిధి నుంచి తప్పించారు.

> **ఈ విషం సరఫరా నిల్పకుంటే సారా త్రాగడమే మేలనుకొనే రోజు లొచ్చేస్తాయి!**

అందువల్ల వారి చేతులు కట్టుబడి పోయాయి. సహకార శాఖాధికారులు చేయ గల్గిందేమీ లేదు. వారి వద్ద సిబ్బందీ లేరు; వున్నా కల్లు అమ్మే వాడి దగ్గరకు తెల్ల చొక్కాతో వెళ్తే తాము తన్నులు తిని తిరిగి రావడం తప్ప, కుండలు పగుల కొట్టలేరు. పోలీసులే ఈ భావి మారణ హోమాన్ని ఆపగల సమర్థులు. ఎస్పి గారు పల్లెటూళ్ల పోలీస్ స్టేషన్లకు కఠినమైన ఉత్తర్వులు జారీ చేసి, సీజన్ కాని సమయంలో దారిన కల్లు కుండ కన్పడితే పగుల గొట్టుకుంటూ వెళ్తే తప్ప ఈ ప్రవాహం ఆగదు. కల్లు - సరఫరాకు కేంద్రం ఏదో, రసాయనాలు ఏ దారిలో వస్తున్నాయో తెలుసు కోవడం కూడా అవసరం.

ఇదిట్లా వుంటే ఎక్సైజ్ అధికారులు తాము చేసే దాడుల సంఖ్య గురించి, దొరికిన సీసాల గురించి ఎన్ని ప్రకటనలు, ఎంత ప్రచారం చేస్తున్నా, నెల్లూరు టౌన్‌లో విస్కీ, బ్రాందీల లభ్యత మెరుగు పడుతున్నదే తప్ప, తరగడం లేదు. త్రాగే వాడికి వెతుక్కో వలసిన అవసరమే రావడం లేదు; కొంచెం ధర అధికంగా చెల్లించ గల్గితే చాలు. మద్రాసు నుంచే కాక బెంగుళూరు నుంచి, కడప సరిహద్దుల నుంచి వేలాది బ్రాందీ సీసాలు నెల్లూరు చేరిపోతున్నాయి. మధు పాన ప్రియుల మత్తు తమకం తీరుస్తున్నాయి. త్రాగుడు నిత్య వ్యసనంగా కల్గిన వారు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా సీసాలు పొంద గల్గుతున్నా రంటేనే వీటి లభ్యతను అంచనా వేయవచ్చు. త్రాగుడు వంటి మానసిక బలహీనతను, సామాజిక రుగ్మతను కేవలం శాసనాలు, చట్టాలు, అధికారులు, దాడులు నిలప లేవని ఈ విస్కీ స్మగ్లింగ్ మరొక సారి రుజావు చేస్తున్నది.

కొరవ 10 పేజీలో

తిక్కవరపు సుబ్బరామ రెడ్డి కళాపీఠం అవార్డుల ప్రధాన సభలో ఎంఎస్ రెడ్డి, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, అక్కినేని నాగేశ్వర రావు, బలరాం జక్కర్, సుబ్బరామ రెడ్డి, పివి రంగారావు.

ఆత్మకూరు ఆర్టీసి డిపో మేనేజర్ అలివైతే సంస్థనే అమ్మే సేట్లున్నాడు!

ప్రజలను నానా తిప్పలు పెడుతూ, పలు అవినీతి ఆరోపణలకు గురైన ఆత్మకూరు డిపో మేనేజర్ పై ఆర్టీసి వున్నతాధికార్లు చర్య తీసుకోకుండా, ఎందుకు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారో అర్థం కావటం లేదు. గతంలో డి.ఎం.గా పనిచేసిన సునీల్ కుమార్ వివిధ రకాల బస్సులను ప్రవేశ పెట్టి, ప్రైవేట్ బస్సులకు ధీటుగా నడిపి డిపో లాభాల బాటన నడిపారు. కాని ప్రస్తుత డిఎం రూప్‌సింగ్ హయాంలో మాత్రం ఆన్ కాంట్రాక్టు బస్సుల ఓనర్లు లాభాలు పండించు కొంటుంటే డిపో ధ్వాన్న స్థితికి చేరుతున్నది. డిపోలో క్యాంటిన్ నిర్మాణ టెండరు విషయంలో డిపో మేనేజర్ అవినీతికి పాల్పడ్డారన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలిసి పోయింది. ఆత్మకూరు డిపోలో క్యాంటిన్ నిర్మాణానికి రెండు అంకణాల స్థలం కేటాయిస్తున్నట్లు నెల్లూరు రీజినల్ ఆఫీసులో టెండరు నిర్వహించారు. ప్రకటించిన స్థలం చాలదని పలువురు దీనిలో పాల్గొన లేరు. ఏకైక టెండరు దారుడైన వ్యక్తితో డిపో మేనేజర్ లాలూచీ పడి రెండు అంకణాల స్థలానికి బదులు 14 అంకణాల విలువైన స్థలాన్ని, పంచాయితీ అనుమతి లేకుండా ఇచ్చివేసి, క్యాంటిన్ నిర్మాణం పూర్తి చేయించారు. పంచాయితీ దీన్ని అభ్యంతర పెట్టడంతో రీజనల్ మేనేజర్ చేత ఎటువంటి సమస్యలు లేకుండా చేస్తానని టెండరు దారుని వద్ద నుంచి భారీ మొత్తంలో సొమ్ము తీసుకొన్నట్లు వినికిడి. 50 ఏళ్ల నుంచి పంచాయితీ బస్టాండుకు బస్సులు రావడం ఆనవాయితీ. ప్రైవేట్ బస్సుల స్థానే ఆర్టీసి బస్సులు వచ్చినా ఈ విధానం

జిల్లావార్తలు

కొనసాగుతున్నది. కాని డిఎం రూప్‌సింగ్ పంచాయితీ బస్టాండుకు బస్సులు రాకుండా చేయడంతో ప్రజలు హై కోర్టును ఆశ్రయించి వాటిని తిరిగి వచ్చేలా చేయాల్సి వచ్చింది. అయినా ఇప్పటికీ బస్సులను డిపో వద్ద నుంచే తిరిగి పంపి వేస్తున్న విషయమై విచారించను హై కోర్టు వచ్చిన అడ్వకేట్ కమీషనర్‌ను మహిళ అని కూడా చూడకుండా, వాస్తవాలు పత్రికల

కొరవ 10 పేజీలో

మైపాడు, కోడూరు రోడ్లు నరకానికి దగ్గరిమెట్లు!

ఏ రోడ్డు చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం? రహదారుల చరిత్ర సమస్తం గోతులు, గతుకులు, దూళి ధూసర మయం! అందులోనూ మైపాడు, కోడూరు రోడ్లు వున్నాయే, వాటి చరిత్రను వర్ణించమని కోరితే, అంతటి మహాకవి శ్రీశ్రీ కూడా సమాధిలో నుంచే ఉలిక్కి పడడం ఖాయం.

గత జన్మలో ఏదో పెద్ద పాపం చేసి వుంటే తప్ప ఈ రోడ్ల మీద ప్రయాణం చేయ వలసిన ఖర్మ పట్టదు!

అవి రహదారులా- ప్రసూతికేంద్రాలా!

ఏ మహా మునో ఇచ్చిన శాపం ఫలితంగా ఈ నరకం అనుభవిస్తున్నారన్నా అతిశయోక్తి కాదు. అల్లీ పురం, సౌత్ ఆములూరుల మీదుగా కోడూరు వరకు వెళ్లే 16 కిలో మీటర్ల రోడ్డు తారుతో వేసిందని చెప్తే కొత్తగా చూసే వారెవరూ నమ్మరు. అక్కడక్కడా పెచ్చులు, పెచ్చులుగా తారు, కంకర కలిసిన బిళ్లలు తప్ప, తక్కిన రోడ్డంతా మట్టి బయట పడిపోయింది. మోకాటి లోతు గుంటలు; దిగుడు బావుల వంటి గొయ్యిలు; మార్జిన్లను చూస్తే భయమేస్తుంది. ఆములూరు మలుపులో, గుడిపల్లి పాడు సెంటర్లో, విలుకాని పల్లి సమీపంలో రోడ్డు అసలు కన్పడ కుండా కొట్టుకు పోయింది.

మైపాడు రోడ్డు పరిస్థితి అంతే! ఇందుకూరు పేట టర్నింగ్‌లో సాలు చెట్ల క్రింద బావులు తప్ప రోడ్డు లేదు; జగదేవి పేట నుంచి రావూరు వరకు డొంక కంటే హీనం.

వాటి పై ఆర్టీసి బస్‌లో ప్రయాణం చేస్తుంటే ఒక్కొక్క మెట్టుకు నరకానికి చేరువౌతున్న భావన కల్గుతుంది. బస్ ఎగిరెగిరి పడుతుంటే ఒంట్లోని ఏ కీలుకాకీలు పట్టకారతో పట్టుకొని మెలి త్రిప్పినట్లుంది. ఈ గ్రామాల ప్రజలకు పురుడు పోసుకోను ఆస్పత్రుల కెళ్లనవసరం లేదు. ఈ రహదార్లే ఉచిత ప్రసూతి కేంద్రాలుగా సేవ చేస్తున్నాయి. నెలలు నిండిన మహిళను బస్సెక్కిస్తే చాలు - నెల్లూరు చేరే లోపల పండంటి బిడ్డను సునాయాసంగా కనేస్తుంది; కానీ ఖర్చు లేదు.

ఏమిటీ రోడ్ల దుర్గతి? ఇవే కాదు, జిల్లాలో దాదాపు అన్ని రోడ్ల పరిస్థితి అంతే అధ్వాన్నంగా తయారై వుంది. ఈ రెండు నెలల వానాకాలం గడిచే టప్పటికి ఇవి ఇంకెంత ముదనష్టంగా తయారౌతాయో వూహించ లేము. ఏ అధికారి నడిగినా డబ్బు లేదనే దిక్కార్లు చేస్తున్నారు. కొత్త రోడ్లు వేయడానికి వదిలి - వున్న రోడ్లలో గుంటలు పూడ్చేందుకు కూడా ఖజానా పోయిందా? గుంటలు ఎప్పటి కప్పుడు పూడ్చి సరి చేయకుంటే రోడ్డు పునాదులతో సహా లేచిపోతుంది. అప్పుడు తిరిగి వేయాలంటే ఎన్ని కోట్లూ చాలవు.

జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్య మంత్రి పై వత్తిడి తెచ్చి అయినా సరే

కొరవ 10 పేజీలో

కావలి సబ్ జడ్జి కోర్టులో

S.C. 39/94

A.S. ధనంజయ -వాది

Vs

కుందుర్తి వెంకటేశ్వర్లు -ప్రతివాది

దావా నోటీసు

కుందుర్తి వెంకటేశ్వర్లు
S/o. పోలయ్య
బోగోలు, బిట్రగుంట

అనువారికి నీ పై వాది తన బాకీ రాబట్టు కొనుటకు దావా చేసినంతలో నీకు నోటీసు నిమిత్తం 25.10.95 తేది నాటికి వాయిదా వేసి యున్నారు. నీవు ఆ దినం పగలు 10.30 గంటలకు కోర్టులో హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల నీ పరోక్షమున తీర్మానించ బడును.

జి. దశరథరామయ్య
వాది అడ్వకేటు, కావలి

కాళహస్తి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టులో

O.S. No. 19/95

కె. నరసమ్మ -వాది

Vs

వి. సుబ్బరామయ్య -ప్రతివాది

నోటీసు

To, వి. సుబ్బరామయ్య
S/o. బికయ్య,
17-37, రాయాజివీధి, నెల్లూరు

పై దావాలో ప్రతివాదికి 16.10.95 తేది పగలు 10.30 గంటలకు నేరుగా గానీ, వకీలు ద్వారా గాని హాజరు కావలసిందిగా కోర్టు ఉత్తర్వు మేర నోటీసు జారీ చేయడమైనది. అట్లు హాజరు కాని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

Date 30.9.95

కె.వి. రమణరావు
డి. ఉమ
Advocates for Plaintiff

పులివెందుల మున్సిఫ్ కోర్టులో

O.S. 192/95

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -వాది
పులివెందుల

Vs

కంబటి ఉత్తన్న, S/o. గంగన్న,
వెంకటాపురం -ప్రతివాది

పై కోర్టులో పై దావా నోటీసు నిమిత్తమై ప్రతి వాదికి వాయిదా 31.10.95 తేదిన ఉన్నది. ఆక్షేపణలున్న తెలుపు కొనవచ్చును.

పులివెందుల 29.9.95

జి. ప్రభాకరశాస్త్రి
అడ్వకేటు

శ్రీనాథ జయంతి పురస్కారం స్వీకరిస్తున్న మద్రాసు, ప్రొఫెసర్ రామచంద్ర చౌదరి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి; సన్మాన కర్తలు హరగోపాల్ రెడ్డి, నరేంద్ర రెడ్డి; వర్ధమాన సమాజం కార్యదర్శి బి.వి. నరసింహం.

తిట్ల పకోడీలు

4 పేజీ కొరవ

వద్దని ఎన్టీఆర్ కుమిలి పోతున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అధికారాన్ని చేజిక్కించుకొన్న ఎమ్మెల్యేలను ప్రజలు గమనిస్తూనే వున్నారని, వీరంతా ప్రజా ఓటు రథచక్రాల క్రింద నలిగి పోయే రోజు ఇంకెంతో దూరంలో లేదని ముగించారు. నల్లపరెడ్డి ప్రసన్న కుమార రెడ్డి మాట్లాడుతూ నమ్మక ద్రోహం ఒక్కటే ఆయుధంగా పెట్టుకొన్న వారు (రమేష్ రెడ్డి) ఇంకా తన చేతి పై ఎన్టీఆర్ పచ్చ బొట్టు ఏ విధంగా వుంచుకొని వున్నాడో తెలియదు. దాన్ని ఆపరేషన్ ద్వారా తొలగించు కొంటే తప్ప ప్రజలు నమ్మరని సలహా యిచ్చారు. మరొకాయన (సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి) మహానాడు సదస్సుకు వచ్చిన ఎన్టీఆర్ దంపతులకు బస ఏర్పాటు చేసి; కాళ్ల పై పడి టిక్కెట్ తెచ్చుకొని గెలిచి, ప్లేటు ఫిరాయించడం తగదన్నారు. తాను గెలిచింది ఎన్టీఆర్, శీనయ్య బొమ్మలతో తప్ప మరొక రకంగా కాదని [illegible] వివరణ యిచ్చు కొన్నారు [illegible] నల్లపరెడ్డి చంద్రశేఖర రెడ్డి [illegible] పార్టీలో చేర్పించి [illegible] ఆ విషయం తల్చుకొని [illegible] ఎరుగుతున్నట్లు చెప్పారు. రావుల [illegible] రంకెలు వేస్తూ నిన్నటి వరకు లక్ష్మీపార్వతి జపం చేసిన జిల్లా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, లక్ష్మయ్య నాయుడు, ఎల్లసిరి నేడు ఆమెను విమర్శిస్తున్నారు; వీరంతా మరి తమ భార్యలకు పదవులు ఇప్పించుకొన్న విషయమై ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకొని గెల్చిన జిల్లా ఎమ్మెల్యేలు తరువాత వెన్నుపోటు పొడవడం పాలు తాగిన రొమ్మునే గుద్దినట్లుందని జడ్పి ఛైర్మన్ నాగభూషణమ్మ విమర్శించారు. ఎమ్మెల్యేలు అంబటి బ్రాహ్మణయ్య, వెంకట కృష్ణారెడ్డి, ఒంగోలు జడ్పి మాజీ ఛైర్మన్ జి. వెంకట సుబ్బయ్య తదితరులు సమావేశంలో మాట్లాడారు

* * *

30 తేది పై సభలో ప్రసన్న చేసిన విమర్శలకు రమేష్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి ప్రతి విమర్శలు చేసారు.

ప్రసన్న అవినీతి పరుడని, పార్టీలు మార్చే నీచ సంస్కృతిని వంట పట్టించుకొన్న వాడని రమేష్ రెడ్డి విమర్శించారు. హరికృష్ణను రాష్ట్రంలో ఏ నియోజక వర్గం నుంచైనా గెలిపించుకొనే సత్తా తమకు వుందని, ఆయన ఓడిపోతే తాను రాజీనామా చేస్తానని రమేష్ రెడ్డి సవాల్ చేశారు. తనను పార్టీ నుండి సస్పెండ్ చేయడానికి ప్రసన్న కారకుడంటూ, హైదరాబాద్‌లో కూలీ జనం చేత ఎన్టీఆర్ ముందు ప్రదర్శన చేయించి, వాడిలు చెప్పినా తానుజన్నాళ్లు నోరు [illegible]దపలేదని; ఇకనైనా మాజీ మంత్రి ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడకుంటే ఊరుకోనన్నారాయన. వై.టి. నాయుడు వంగవీటి రంగా చనిపోయి నప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి తెలుగు దేశం కార్యాలయాన్ని ధ్వంసం చేయించడంతో పాటు, బాలకృష్ణ కటౌట్ తగల బెట్టించిన ఘనుడన్నారు. పి.టి. రంగరాజన్ కిరోసిన్ బ్లాక్ మార్కెటర్ అన్న సంగతి ప్రజలకు తెలుసన్నారు. తాను పుట్టుకతో ఎన్టీఆర్ అభిమానినని; అన్న పుట్టిన రోజే తన కుమార్తె పుట్టిందంటూ; తన చేతి పై పచ్చ బొట్టు తొలగించుకోమని సలహా యిచ్చిన ప్రసన్నకు దమ్ముంటే ఆయన చేతి పై ఎన్టీఆర్ పేరు పచ్చబొట్టు రూపంలో వేయించు కోవాలన్నారు.

* * *

లక్ష్మీపార్వతి భజన బృందం సభ్యుడైన ప్రసన్న కుమార రెడ్డి, నరకులిని కట్టగా భావించి వదలి వేసిన ఇతరులు కొద్ది మంది మాత్రమే ప్రస్తుతం జిల్లాలో ఎన్టీఆర్ వర్గంలో వున్నట్లు సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి చెప్పారు. తాను వజ్రమని ప్రసన్న సొంత డబ్బా కొట్టుకొంటే సరిపోదని. స్వర్గీయ శ్రీనివాసులు రెడ్డి పేరు ఉచ్చరించే అర్హత, యోగ్యత ఆయన కుమారులకు లేదని, ఆయన బ్రతికి వున్న రోజుల్లో నమ్మిన బంటులా వ్యవహరించి పేరు నిలబెట్టిన మేనల్లుడైన తనకు మాత్రమే ఆ అర్హత వుందన్నారు. నల్లపురెడ్డి ఇంటి పేరు కల్గిన వారందరికీ సర్పంచ్ పదవి నుంచి కార్పొరేషన్ పదవి వరకు ఇప్పించిన వారు తనను విమర్శించడం తగదన్నారు. చంద్రబాబు, హరికృష్ణ, వెంకటేశ్వర రావులను సోమిరెడ్డి త్రిమూర్తులుగా పోలుస్తూ, వారివల్లే నిత్యావసర వస్తువుల ధరలు వారంలో తగ్గినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు కృషి చేయకుంటే ముచ్చటగా మరోసారి ఓడిపోయే డాక్టర్ నాగభూషణమ్మ ఎమ్మెల్యేలను విమర్శించడం ఏరుదాటాక తెప్ప తగలేసిన చందాన్ని గుర్తు చేస్తున్నట్లు చెప్పారు.

నెల్లూరు సంగతులు

4 పేజీ కొరవ

వారి నట్టిక్కులు బోధిస్తారని ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి తెలియ జేస్తున్నారు. లెక్చరర్లు హృదయ పూర్వకంగా చెబితే వీటి వల్ల ప్రయోజనం వుంటుంది. మొక్కుబడిగా నటిస్తే విద్యార్థులు రెండింటికీ చెడిన రేవడు లవుతారు.

బిసి కార్పొరేషన్ పని తీరు అధ్వాన్నం

బిసి. ఎస్‌సి కార్పొరేషన్లు తమకు కేటాయించిన నిధులు యోగ్యమైన వారికి అంద జేయడంలో ఎప్పుడూ విఫల మవుతూనే వున్నాయి. వేలకొద్ది రుణాల దరఖాస్తులు ఈ ఆఫీసుల్లో చెదలు పట్టి పోతున్నా శాఖాధికారుల్లో చలనం లేదు. ఈ విషయాన్ని గతవారం జిల్లాలో పర్యటించిన శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ గమనించింది. జిల్లాలో వివిధ శాఖల కంటె బిసి కార్పొరేషన్‌కు పనితీరు అధ్వాన్నంగా వుందని; ఎస్‌సి కార్పొరేషన్ గత మూడేళ్లుగా కేటాయించిన నిధులు అసలు ఖర్చు కాలేదని, ఫైనర్ ఎరిగేషన్ శాఖలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని, వీటిని సరిదిద్దమని జిల్లా కలెక్టర్‌ను కమిటీ అధ్యక్షుడు కన్నా లక్ష్మి నారాయణ కోరారు. నిరుద్యోగులు రుణాల కోసం కాళ్లు అరిగేలా తిరిగినా కరుణించని అధికారులు తమకు మామూళ్లు ఇచ్చే వారినే కరుణి స్తారన్న విమర్శ సర్వత్రా వుంది. దీన్ని కలెక్టర్ సరిదిద్దాలి.

మునిసిపాలిటీలో కేజి 6.50కే బియ్యం!

మునిసిపాలిటీలో నివసించే మధ్య తరగతి ప్రజలకు వుపయోగ పడే విధంగా కేజి 6.50 రూపాయలకే మేలు రకం బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇప్పటికే జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల కోటా విడుదల య్యిందని జిల్లా కలెక్టర్ ఎ. గిరిధర్ చెప్పారు. నెల్లూరు, గూడూరు, కావలి మునిసి పాలిటీల్లో కార్డు కల్గిన వారందరూ వీటిని రేషన్ షాపుల నుంచి తెచ్చుకోవచ్చు. అయితే కార్డుకు 25 కేజీలు మించి ఇవ్వరు.

పోలియో నివారణ చర్యలు

పిల్లలలో పోలియో వ్యాధి జిల్లాలో ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రభుత్వం చేపట్ట నున్నారు. పిల్లలకు ఇంతకు మునుపు పోలియో చుక్కలు వేశారా, లేదా అనే విషయాన్ని తీసి ప్రక్కన బెట్టి, మళ్లీ 3 సంవత్సరాల వయస్సు లోపు వున్న పిల్లలందరికీ రెండు డోసుల పోలియో చుక్కలు వేస్తారు. ఈ పనిని ఒక వుద్యమంగా చేపట్టి ప్రతి బిడ్డకూ తల్లి తండ్రులే టీకాలు అడిగి వేయించుకొనే స్థితికి తీసుకొస్తామని ఇన్‌ఛార్జి కలెక్టర్ గిరిధర్ చెబుతున్నారు. పోలియో వల్ల కలిగే అనర్థాలు, చుక్కల అవసరాన్ని ప్రతిబింబిస్తూ వాల్ పోస్టర్లు, వినాదాల నమూనాలను రూపకల్పన చేసి కన్వీనర్, జిల్లా సాక్షరతా సమితి, కస్తూర్బా కళాక్షేత్రం, నెల్లూరు -3. కు పంపాలని చిత్రకారులను ఆయనే కోరుతున్నారు. వీరికి మంచి బహుమతులు కూడా ఇస్తా మంటున్నారు కలెక్టర్ గారు.

శివారెడ్డి పద్యాలు

సరోజ - హేమచంద్ర

అందచందముల్లో అమ్మాయి అబ్బాయి
ఇద్దరొకటె లేదు కొద్ది తేడా
పెళ్ళి వైభవాన్ని వెళ్లి చూసొచ్చా
హాలు బట్టలేలవేలు గెప్పు

50 ఏళ్ళ క్రితం

3 పేజీ కొరవ

యెంకి పాటలలో మరింత మధురమైనవి కొన్ని గలవు; 'ఉత్తమాటలు నీవి...' 'యెనుక జల్మము లోన...' 'మెళ్లో పూసల పేరు' 'గేవు మాలచ్మికి' ఇట్ల ఎన్నో వున్నవి. పొందికగా నాలుగైదు సంగ్రహించి, చక్కగా అభినయించి వచ్చును. తగిన పరికరములు, ప్రోత్సాహము లభ్యమైతే పిరదౌసి లోని మరికొన్ని ఘట్టముల ఇంక వేయి రెట్లు శోభింప చేయవచ్చును. శ్రీ రాధాకృష్ణా రెడ్డి ఛాయాచిత్రమును గోపాల రెడ్డి గారు బహిర్గత పరచిరి.

అవీ - ఇవీ

గోధుమలు బలంగా వచ్చి వున్నాయి. కాబట్టి అవి అయి పోయే వరకు యిష్టమైన వారు యిష్ట మొచ్చినన్ని గోధుమలు కొనుక్కోవచ్చు. ఆ వార బియ్యం రేషన్‌లో అదనంగా తగ్గింపు వుండదు. ఇది వరలో మాదిరి ఆరోవంతు మాత్రమే తగ్గింపు.

* * *

నెల్లూరు తా. కొత్త కోడూరుకు తూర్పున వాగు వొడ్డున గత 29 తేది ఉదయం ఎవరో ఒక తల్లి మగ శిశువును కని నోట్లో యింత మట్టి వేసి, జమ్ము వంచి దాని మీద పంద బెట్టి వెళ్లి పోయింది. ఇంతలో ఎవరో చూచి తీశారు ఆ బిడ్డను. మూల వెఱ్ఱమ్మ కిచ్చారు సాక్కోవ దానికి. ఈ మహాశయుడు రేపు నందనార్ ఔతాడో, అంబేద్ కార్ కిమ్యాటోడా ఎవడు చెప్పగలడు?

* * *

బెజవాడ రామచంద్రా రెడ్డి గారు కేంద్ర శాసన సభ ఎన్నికలలో నెల్లూరు, గుంటూరు జనరల్ సీటుకు జస్టిస్ అభ్యర్థిగా నిలబడనని నెల్లూరు ఆంధ్ర పత్రిక విలేఖరితో అన్నారట.

-విమర్శకుడు

పంచాంగం

ముహూర్తములు

8తేది ఆదివారం ఉదయం 9.31 గంటలకు వృశ్చిక లగ్నమున ఉపనయన వివాహ, వ్యాపార ప్రారంభములకు సుముహూర్త మున్నది.

అక్టోబరు తిథులు

ఆశ్వయుజ శుద్ధ
తే 7 శని చతుర్థశి రా.గ. 9.19వ
తే 8 ఆది పూర్ణిమ రా.గ. 8.50వ
ఆశ్వయుజ కృష్ణ పక్ష తిథులు
తే 9 సోమ పాడ్యమి రా.గ. 8.47వ
తే 10 మంగళ విదియ రా.గ. 9.18వ
తే 11 బుధ తదియ రా.గ. 10.19వ
తే 12 గురు చతుర్థి రా.గ. 11.46వ
తే 13 శుక్ర పంచమి రా.గ. 1.3[illegible]
స్వయంపాకుల శ్రీనివాసులు, [illegible]

రాఘవేంద్రరావు నృత్య దర్శకత్వం

తెలుగు మారుతున్నా తన క్రేజ్ ఏ మాత్రం మారని దర్శకుడుగా కె. రాఘవేంద్ర రావు పేరు గాంచారు. ఆయన తీసే చిత్రాల్లో పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పరిశ్రమలో ప్రవేశించిన కొత్తలో జ్యోతి వంటి లోబడ్జెట్ చిత్రాలు తీసినా తరువాత ఆయన స్టార్స్ నటించే సూపర్ చిత్రాలకే ఎక్కువగా దర్శకత్వం వహించారు. తాజాగా తానే స్వయంగా నిర్మిస్తున్న లోబడ్జెట్ పెళ్లి సందడి చిత్రానికి స్క్రీన్‌ప్లే బాధ్యతతో పాటు కొత్తగా డ్యాన్స్ డైరక్టర్ పాత్ర కూడా నిర్వహిస్తున్నారు.

వర్తమాన నటుడు ఆమె ఫేం శ్రీకాంత్, రవళితో పాటు హిందీ నటి దీప్తి భట్నాగర్ ఇందులో నటిస్తారు. ఈ చిత్రంలో 9 పాటలున్నాయి.

అశ్వని స్థానంలో జయసుధ!

కొందరు నిర్మాతలు తమ సినిమాల్లో ఒకే హీరోనే బుక్ చేయడం సంప్రదాయంగా పెట్టుకొని వుంటారు. ఆ హీరోలకు కాల్షీట్ లేకుంటే సినిమా తీయకుండానే పూరుకొంటారు. నిర్మాత టివిడి ప్రసాద్ ఇదే ధోరణిలో వరుసగా రాణి అశ్వని నాచప్పుతోనే పలుసినిమాలు తీశారు. ఆమెకు పెళ్లి అవడంతో ఇప్పుడాయన దృష్టి జయసుధ మీద పడింది. అంటే చిత్రంతో జయసుధ హీరోయిన్‌గా మొదటి చిత్రం తీసారు. తరువాత చిత్రం పెళ్లాల రాజ్యంలో కూడా జయసుధదే ప్రధాన పాత్ర. తదుపరి చిత్రంలో కూడా జయసుధే హీరోయిన్ అని నిజందుగానే ప్రకటించిన ప్రసాద్ తాను నిర్మించే మొదటి చిత్రం నుంచి మౌళిని దర్శకుడుగా పెట్టడం మరో విశేషం.

యాసిడ్ రాజా అరెస్ట్

సంచలనం అంటూ సినిమాల్లో ఏదో ప్రయోగాలు చేస్తుంటారు నిర్మాతలు - దర్శకులు. తెలుగులో ప్రస్తుతం రాజశేఖర్ హీరోగా నటిస్తున్న 'ఓం' చిత్రం మొదట కన్నడంలో నిర్మించగా సూపర్ హిట్టయ్యింది. ఈ చిత్రంలో దర్శకుడు ఉపేంద్ర ఒక ప్రయోగం

కొరవ 10 పేజీలో



పెద్దింటి కోడలు చిత్రంలో అక్కినేని నాగేశ్వరావు, తులసి

జయలలితకు పీడకలలు తెప్పిస్తున్న రజనీ చిలిపి చేష్టలు!

తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, తమిళ సూపర్ స్టార్ రజనీ కాంత్ ఒకే వీధిలో మద్రాస్, పోయాస్ గార్డెన్‌లో నివాస ముండే వారు. జడ్ క్యాటగిరి భద్రతను జయలలితకు సమకూర్చి ఉండడం వల్ల ఆమె తన కార్యాలయానికి బయలు దేరే సమయాల్లో ఆ వీధిలో ట్రాఫిక్ నిలిపి వేసేవారు. దీనివల్ల షూటింగ్‌లకు వెళ్లే సమయంలో రజనీ కాంత్ పలు ఇబ్బందులు పడి తన నివాసాన్ని ఆ ప్రాంతం నుంచే మార్చేశారు. రజనీ కాంత్ - జయలలిత మధ్య అప్పటి నుంచి చిన్న విభేధాలు ప్రారంభమై అవి క్రమ క్రమంగా తీవ్ర రూపం దాల్చాయి. గతవారం షూటింగ్ కోసం మద్రాస్ సిటీలో రజనీ కాంత్ వెళ్తున్నప్పుడు ఒక చోట ట్రాఫిక్ పోలీసులు ఆయన కారును ఆపేశారు. పురచ్చి తలైవి జయలలిత ఆ వీధి చివర సభలో ప్రసంగిస్తున్నా[illegible] కారు [illegible] కదల [illegible]న్నారు.

రజనీ కాంత్ [illegible] ముందే [illegible] చిన్న ఓర్పులేక పో[illegible]. [illegible] డోర్ తెరుచుకొని, రోడ్డుపై [illegible] ప్రారంభించారు. నేరుగా ఒక కొట్టులోకి సిగరెట్ వెలిగించుకొని వెళ్తు... రజనీకాంత్ చుట్టూ జనం మూగ నారంభించారు. రోడ్డు పై రజనీ నడక కలకలం షూటింగ్‌లోని జనం చెవులకు [illegible] జయలలిత [illegible] రజనీ వైపు [illegible] జయలలిత పోలీసు అధికారుల పై మండి పడ్డారు. జన ప్రవాహం మధ్య నుంచి ఆయన్ను తప్పించి, కారెక్కించి, అదే రోడ్డు మీద సకల రాజ మర్యాదలతో సాగ నంపడంతో ఈ ప్రహసనం ముగిసిందట. ఈ మధ్య రజనీ కాంత్ పేరు వింటేనే ఉక్కు మనిషిగా పేరుగాంచిన జయలలిత వణికి పోతున్నారు. రజనీ కాంత్ రాజకీయ రంగ ప్రవేశం చేయనని ఒక వైపు ప్రకటించినా, మరో వైపు మద్రాసులోని ఆయన కళ్యాణ మండపంలో రాజకీయ రంగ ప్రవేశం ముఖ్యాంశాలు పాటల క్యాసెట్‌లు తయారవు తున్నాయి. దీని భావమేమి తిరుమలేశా?

శివ విలన్‌ను చావబాదిన సెక్రటరి!

శివ చిత్రంలో విలన్‌గా ప్రతిభా వంతంగా నటించిన రఘువరన్ పలువురు అభిమానులను సంపాదించుకొన్నాడు. కాని నిజ జీవితంలో తన స్వంత సెక్రటరి వడివేలు చావ బాదడంతో ప్రస్తుతం మద్రాసు అపోలో ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నాడు. సెప్టెంబర్ 19 తేది వడివేలు లక్షలు కాజేసాడని రఘువరన్ నిలదీయడంతో మాటా మాట పెరగడం సెక్రటరీ అసలైన విలన్‌గా మారి, చెక్క కుర్చీ తీసి రఘువరన్ తలపై బాదడంతో తల పగిలి స్పృహ కోల్పోయి ఆసుపత్రి [illegible]

అక్కినేనికి తిక్కవరపు అవార్డు

తిక్కవరపు సుబ్బరామ రెడ్డి గారు తన పేరుతో నెలకొల్పిన కళాపీఠం తరపున "లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు" ఒకటి ప్రారంభించారు. తమ తల్లి దండ్రులు - టి. బాబురెడ్డి, టి. రుక్మిణమ్మల జ్ఞాపకార్థం, ఏటా కొందరు ప్రముఖులకు రు. 50 వేల నగదు బహుమతి అందజేస్తారు. తొలిసారిగా ఈ అవార్డును ఈసారి డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణలకు అంద జేశారు. సెప్టెంబరు 17 తేది, సుబ్బరామ రెడ్డి జన్మ దినం రోజు, విశాఖ పట్నంలోని గురజాడ కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం అతి వైభవంగా జరిగింది. కేంద్ర వ్యవసాయ శాఖ మాత్యులు శ్రీ బలరాం జక్కర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు; పుష్పగిరి పీఠాధిపతి శ్రీ శంకరా చార్యుల వారు ఆశీస్సు లందజేశారు. సినీ నిర్మాత శ్రీ ఎం.ఎస్. రెడ్డి, మాజీ మంత్రి శ్రీ పి.వి. రంగారావు, రాజ్యసభ సభ్యులు శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ, మోహన్ బాబు, సినీ దర్శకుడు దాసరి నారాయణ రావు, విశాఖ మునిసిపల్ మేయర్లు, స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారు గజల్స్ ఆలపించారు. పదివేల మంది ప్రజల సమక్షంలో అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది కార్యక్రమం.

విశాఖలో ఎందుకీ సభలు?

సుబ్బరామ రెడ్డి గారి కెందుకో విశాఖ పట్నం నగరం పై మోజు. ఏ కార్యక్రమం చేసినా అక్కడే చేస్తారు; ఏ

కొరవ 10 పేజీలో

దొరబాబు: చచ్చుగా వుంది!

"దొరబాబు" చిత్రం అంతర్జాతీయ [illegible] ఆధారంగా తీసింది. దీనికి జతగా [illegible] రాజకీయ ధోరణులు, సాంఘిక [illegible]వం, దేశంలోని [illegible]తిగతులు, ప్రజా[illegible]కి కలిగే అవరోధాలు జత [illegible]పారు. ఈ అంశా[illegible]కొని వున్న చిత్రం ఒక [illegible]ముల ఉరమాలి, ఒక విద్యుత్ మెరుపులా మెరవాలి. కాని ఇందులో [illegible]దా ఆ చురుకు దనం, కరుకు దనం [illegible]పించవు. సహజత్వం లో[illegible] చచ్చుగా తయారైంది. పరుచూరి [illegible] వ్రాసిన కథ, మాటలు ఇందుకు మొ[illegible] కారణం. దర్శకుడు [illegible] సుబ్బరావు వ్రాసిన స్క్రీన్‌ప్లే [illegible] కారణం. పరుచూ[illegible] కథను సాగదీశారు. [illegible] సన్నివేశాలను కలిపారు.

ఆ పాత్రను మాస్టర్ ఆదిత్య పోషించారు. ఆ పనివాడి పాత్రకు వయసుకు మించిన మాటలు వ్రాశారు. వివరీత ధోరణితో కూడుకున్న మాటలు ఆ పసివాడి పాత్రను దెబ్బతీశాయి. కథ నిడివి పెంచటానికి దర్శకుడు కథనంలో చేర్చిన దృశ్యాలు గందర గోళంగా

గిద్దలూరు గోపాలరావు

[illegible] సెంటిమెంట్‌, సాంఘిక [illegible], దేశభక్తి వగైరాలతో కూడుకున్న ఈ చిత్రాన్ని ముగ్గురు ముద్దు గుమ్మ[illegible] హీరో ముద్దుగిచ్చే దృశ్యంతో ప్రారంభించటం [illegible] వుంది. చిత్రం ఆద్యాన్ని విస్మరించి ముద్దులు, నృత్యాలు, ద్వంద్వార్థాలతో కూడుకున్న

సాధించాలని [illegible] దర్శకుడు చేసిన ప్రయత్నం [illegible]ంది. చిత్రం దెబ్బ తినిపోయింది.

హీరో రవి[illegible] (శోభన్ బాబు) రైల్వే స్టేషన్ మాస్టర్; అతనికి దేశభక్తి ఎక్కువ. అంతర్జాతీయ [illegible] దేశంలోని [illegible] యిజాన్ని, [illegible] తన [illegible] ప్రభుత్వం [illegible] విరుదు [illegible] వుంటుంది. [illegible] అతనికి [illegible] ఒక అవకాశం [illegible] టెర్రరిస్టులు తిరుమలా వుంటే భారతి అనే [illegible] తప్పించుకొని స్టేషన్ [illegible]



జమీన్‌రైతు మేనేజరు తూపిలి వనమాలి కుమారుడు హేమచంద్ర, సరోజ; వీరి వివాహం 4 తేది నెల్లూరులో జరిగింది.

జనవాణి

3 పేజీ కొరవ

త్రాగరాదు. స్త్రీలను గౌరవించటం మన సాంప్రదాయం. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం వంటి నినాదాలు ప్రతి ఒక్కరికీ కనపడుతూనే వుంటాయి. కాని డ్రైవర్, కండక్టర్ పొగ తాగుతూనే వుంటారు. చిల్లర లేదని ప్రయాణీకుల మిగులు చిల్లరను కండక్టర్ తన స్వంతం చేసుకొంటూనే వుంటాడు. స్త్రీలను గౌరవించటం మన సాంప్రదాయమన్న నినాదం పురుషాంకార ప్రపంచాన్ని బ్రతిమలాడుతున్నట్లే వుంది కానీ అదొక హక్కుగా లేదు. స్త్రీలకు కేటాయించిన సీట్లు కేవలం స్త్రీలకే పరిమితం అని వ్రాసి దాన్ని కండక్టర్లు అమలు జరిపితే బాగుంటుంది. తమిళనాడులోని బస్సులలో సీట్ల కేటాయింపు విషయం చూసైనా మన రాష్ట్రంలోని ఆర్టీసి వారు కొంత నేర్చుకోవాలి.

అల్లూరు -ఎం.చంద్రశేఖరరావు

గాంధీ ఆశయాలు అమలుచేసే వారెవరు?

దేశానికి అమూల్య సేవలు చేసిన త్యాగమూర్తుల విగ్రహాలు పలు ప్రాంతాల్లో వెలసి వున్నాయి. అందులో జాతిపిత గాంధీజీ విగ్రహం లేని గ్రామాలు దేశంలో చాలా తక్కువగా వున్నాయి. కాని చాలా విగ్రహాలు, ఆలన, పాలన లేక దుస్థితిలో వున్నాయి. అంగ వస్త్రం పెచ్చులాడి, రంగులు వెలిసి, చేతులు విరిగ్గి చేతి కర్ర మాయమై, కళ్ల జోడు పడిపోయి విగ్రహాల ఆకారం గుర్తు పట్టలేనట్లు తయారై పోయి వున్నాయి. జయంతి నాడు, వర్ధంతి నాడు జాతిపిత హఠాత్తుగా గుర్తుకు వస్తాడు. ఒక పూలదండ వేసి అదేదో ఘన కార్యం చేసినట్లు ఫోటోల్లో ఫోజులిస్తుంటారు. ఆశయాలను వుపన్యాసాల్లో ఆ రోజు దంచి పెడతారు. కాని దేశంలో ఏ ఒక్క నాయకుడూ ఆ మార్గాన్ని అనుసరించక పోవడం దేశ దౌర్భాగ్యం.

గూడూరు -కె. విజయకుమార్

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి!

ఆంధ్ర ప్రదేశ్‌లో వ్యాపార వర్గాలను అనవసరంగా ఆందోళన పెట్టి, వారిని అరెస్ట్ చేసి, సరకులను సీజ్ చేసి జైలుకు పంపు తుండేవారు. నిత్యావసర వస్తువుల చట్టం మునుగులో 1991లో 34వేల కేసులు నమోదు కాగా 600 మందికి, 92లో 20వేల కేసులకు గాను 280 మందికి శిక్ష పడింది. అంటే నాలుగు శాతం కేసులు మాత్రమే రుజువయ్యాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాగా అధ్యయనం చేసారు. అందువల్లనే నిత్యావసర వస్తువుల చట్టాన్ని, తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు. అనవసరంగా స్టాకు నిలువ చేసి రేట్లు పెంచకుండా వ్యాపారస్తులు న్యాయమైన లాభాలు వేసుకొని ప్రజలకు రేట్లు అందుబాటులో వుండేట్లు తగ్గించి ప్రభుత్వాకి సహకరించమని కోరారు. వ్యాపారస్తులు నిజాయితీని ప్రదర్శిస్తే నిత్యావసర చట్టాన్ని శాశ్వతంగా నిలుపుదల చేస్తానన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారస్తులు జార విడువక, తమ నిజాయితీని నిరూపించు కోవాలి. నిత్యావసర వస్తువుల ధరలు ప్రజల అందుబాటులో వుంచి ప్రభుత్వం, ప్రజల మన్ననలు పొందాలి.

నెల్లూరు -వొమ్మిన సుబ్రహ్మణ్యం

జాతిపితకు నిజమైన నివాళి

ప్రధాని పివి నరసింహా రావు గాంధీ జయంతిని పురస్క రించుకొని స్వాతంత్ర్యోద్యమ యోధుల సమావేశంలో ప్రసంగిస్తూ సముచిత నిర్ణయం ప్రకటించారు. గాంధీజీ పేరిట నోబుల్ శాంతి బహుమతి తరహాలో కోటి రూపాయల విలువైన బహుమానం ప్రకటించడం హర్షణీయం. దేశం కోసం ప్రాణాలు ధారబోసిన ఆ మహాత్ముని గుర్తు పెట్టుకొని ప్రధాని తీసుకొన్న నిర్ణయం జాతిపితకు సరియైన నివాళిగా దేశప్రజలు భావిస్తారు. గాంధీజీ అహింసా సిద్ధాంతం ప్రపంచ వ్యాప్తంగా తిరుగులేని సిద్ధాంతంగా మారిన చాలా రోజుల తరువాత ఈ నిర్ణయం భారత దేశం తీసుకోవడం మరో కోణంలో విమర్శకు కూడా గురౌతుంది.

నెల్లూరు -జె.పోలిరెడ్డి

పక్కా ఇళ్లు- రాజకీయ నాయకులు

చంద్రబాబు నాయుడు పేదలకు పక్కా ఇళ్లు నిర్మించ డానికి హామీ ఇవ్వటం ఆనందకరం. గతంలో పక్కా ఇళ్ల కేటాయింపులో అనేక అవక తవకలు జరిగాయి. వార్షిక ఆదాయం ఆరు వేల రూపాయలు వున్న వారికి ఈ ఇళ్లు కేటాయించాల్సి వుండగా అధిక ఆదాయం పొందుతున్న వారు దళారుల ద్వారా ఈ సదుపాయం కాజేశారు. రాజకీయ ప్రాబల్యంలోనూ ఈ పథకాన్ని దుర్వినియోగ పరుస్తున్నారు. నూతన ముఖ్యమంత్రి ఈ విషయాలను గుర్తు పెట్టుకొని ఈ సారైనా పథకం అమలులో సక్రమమైన పద్ధతులు పాటిస్తే పేదలు పది కాలాలు ఆయన పేరు మరువరు.

ఆత్మకూరు -వి. రమణయ్య

సబ్సిడీ పథకాలకు మంగళం పాడాలి!

ఏ దేశంలోనూ మన దేశం లాగా రిజర్వేషన్లు కాని, రాయితీలు కాని ఇవ్వటం లేదు. కాల చక్రం ఎన్నో రీతులుగా మారు తుంది. కాని భారత దేశంలో ఎన్నికలే పరమావధిగా, రాజకీయాలే పరమ వేదంగా నడుస్తున్నాయి. రాజ్యాధి కారం రావాలంటే ఏదో విధంగా ప్రజలను మభ్య పెట్టాలి. జాతీయ దృష్టితో కాక చౌక బారు వాగ్దానాలు చేసి నాయకులు రాజకీయ మనుగడ కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్ రెండు రూపాయల కిలో బియ్యం పుణ్యాన ప్రధాని పివి నరసింహా రావు కూడా మరికొన్ని ప్రజాకర్షక పథకాలకు రూపు ఇవ్వాల్సి వచ్చింది. మన దేశంలో కొనుగోలు శక్తి [illegible]. 50 రూపాయలు కూలి ఇచ్చినా మనుషులు దొరక నంతగా పనులు ఏర్పడినాయి. మూర పూలు మూడు రూపాయలు పలుకు తున్నాయి. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధైర్యం చేయాలి. 2 రూపాయల కిలో బియ్యం పథకానికి మంగళం పాడాలి. అప్పుడు గాని రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని చేయలేరు. ఈ విషయం ఆయనకు తెలియంది కాదు. కాని ఓట్లు జవురుకొనే విధానాన్ని నేర్చుకున్న రాజకీయ నాయకులు ఆ బాటను వీడరు.

నెల్లూరు -వాస్తు రామచంద్ర

సుబ్బరామరెడ్డి

9 పేజీ కొరవ

దానం చేసినా కూడా ఆ నగరానికే ఇస్తున్నాడు. కొన్ని లక్షల రూపాయలు విరాళాలుగా ఇచ్చి పలు సంస్థలు స్థాపించాడు. ఆయన పుట్టిన వూరు నెల్లూరు; వుండేది హైదరాబాదులో; ఈ రెండింటినీ వదలి ఎక్కడో మారుమూల వుండే విశాఖలో ఎందుకీ కార్యక్రమాలు? ఇతరత్రా ఎటు పోయినా తమ తల్లి దండ్రుల స్మారకంగా ఇచ్చే అవార్డు సభను నెల్లూరులో జరిపించడం సముచితం. ఆయన తల్లిదండ్రులకు నెల్లూరులో పరిచితు లుంటారు కాని, విశాఖలో ఎవరున్నారు?

తిక్కవరపు సుబ్బరామ రెడ్డి గారు చేసే లెక్కకు మించిన కార్యక్రమాలు, లక్షల్లో జరిపే దాన ధర్మాల్లో సార్థక మైనవి ఈ అవార్డుల ప్రదానం; స్వర్గీయ జికె రెడ్డి పేరుతో స్థాపించిన జర్నలిస్ట్ సత్కారం. ఇటువంటి సత్కార్యాల కోసం తన సమయాన్ని, ధనాన్ని వెచ్చిస్తున్న సుబ్బరామ రెడ్డి గారిని మనసారా అభినందిస్తున్నాం.

కల్తీ కల్లు

7 పేజీ కొరవ

ఒక్కటి మాత్రం నిజం; త్రాగనిదే బ్రతక లేమనే దౌర్భల్యులు తప్ప, ఇతరులు ఈ వ్యసనం బారి నుంచి తప్పించు కున్నారు. సరదా కోసం త్రాగడం అలవాటైన వారు దాన్ని మానుకో గల్గారు. ఈ రూపంలో సారా ఉద్యమం రాష్ట్రానికి మహోప కారం చేసినట్లే లెక్క. గతంలో చేసిన సారా నిషేధ శాసనాలు, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాల అనుభవాలతో పోల్చినా ఇప్పుడు రాష్ట్రంలో అమలౌతున్న మద్య నిషేధం విజయ వంతమైనట్లే లెక్క. అది జనం నుంచి వస్తున్న ఒత్తిడో, లేక అధికారులలోనే ఆ మాత్రం చిత్తశుద్ధి ఏర్పడిందో తెలియదు కాని, ఇది వరకటి వలె సారా స్మగ్లర్ల విచ్చలవిడి లేదు; వూరూరా నాటు సారా బట్టీలు లేవు. ఎక్సైజ్ అధికార్లు మరికొంచెం అప్రమత్తతతో వ్యవహరించ గల్గితే, ఒకటి రెండేళ్లు ఇదే పట్టుతో చట్టం అమలు చేస్తే రాష్ట్రం నుంచి సారా వ్యసన రాక్షసి పారిపోతుంది.

జిల్లావార్తలు

7 పేజీ కొరవ

వారితో చెప్పిందనే అక్కసుతో ఆమె పైనే ఆరోపణలు చేసిన ఘనత డిఎం గారికే చెల్లింది. అలివైతే ఆర్టిసినే అమ్మేయ డానికి సిద్ధ పడేంత ప్రమాద కరంగా వున్న ఈ డిపో మేనేజర్ పై విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మైపాడు రోడ్డు

7 పేజీ కొరవ

- కనీస పాటి మెయింటెనెన్స్ గ్రాంట్ తెచ్చి, వానల్లోపల గుంటలు, గతుకులు పూడ్పించాలి. లేకుంటే శాశ్వతంగా రోడ్డు లేని దౌర్భాగ్య పరిస్థితులు దాపురిస్తాయి.

ఆర్ అండ్ బి అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మకై పైపైన తారు చల్లినా బిల్లులు చెల్లించ బట్టి ఈ దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది కాని, ఒక్క ఏడాది మెయింటెనెన్స్ లేనంత మాత్రాన రోడ్లంత ఛండాలంగా తయారౌతాయా? మైపాడు రోడ్డులో జగదేవి పేట కోడూరుల మధ్య గత ఏడాది రోడ్డు వేశారు; కానీ ఒకే ఒక్క రోజులో అది కొట్టుక పోయింది. ఆ కాంట్రాక్టరెవరో కాని, కంకర తుడుపు కోసం కూడా తారు వాడలేదు. వానలు పడే సమయం చూసి, కంకర చల్లేశాడు. నేరం వాన దేవుడి మీదకు నెట్టి డబ్బు చేసుకున్నాడు. అధికారులు ఎంత దారుణ అవినీతి పరులుగా మారి వుండకుంటే కాంట్రాక్టర్లకు అంత ధైర్యం వస్తుంది? ఏ న్యాయమూర్తయినా జోక్యం చేసుకొని, సంబంధిత ఇంజనీర్లు ఈ రోడ్లపైన కనీసం నెల రోజులు వరుసగా ఆర్టీసి బస్ వెనుక సీటులో కూర్చొని ప్రయాణం చేయాలన్న శిక్ష విధిస్తే ఎంత బాగుంటుంది? నడ్డి విరిగి, ఎముకలు కదిలి, కీళ్లు పట్టుక పోయి నప్పుడైనా తమ లంచాల నిధానికి ప్రజలెన్ని అవస్థలను భరిస్తున్నారో వీరికి అర్థమౌతుంది కదా?

సినిమా

9 పేజీ కొరవ

వేసాడు. బెంగుళూరు సిటీలోని రౌడీ లందరికీ ఈ చిత్రంలో రౌడీ క్యారెక్టర్లు ఇచ్చారు. వారిలో యాసిడ్ రాజా ఒకడు. రోడ్డు మీద వెళ్లే అమ్మాయిల మీద యాసిడ్ పోసి నేరుగా కాఠిన్యతం. అడ్డొచ్చే జనాల మీద, పోలీసుల మీద యాసిడ్ పోయడం రాజాకు సరదా. సినిమాలో రాజాకు అదే క్యారెక్టర్ ఇచ్చారు. సినిమా రిలీజ్ అయ్యాక రాజా మరింత రెచ్చి పోయాడు. పక్షం రోజుల క్రితం ఒక పోలీసు మీద యాసిడ్ పోస్తుండగా బెంగుళూరు పోలీసు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని న్యాయస్థానంలో జడ్జి ముందు నిలబెట్టింది. యాసిడ్ పోయడం అమానుషం కాదా? అని రాజాను జడ్జి గారు ప్రశ్నించగా కత్తికన్నా యాసిడ్ పవర్‌ఫుల్ అన్నాడట. ఆ జవాబు విని న్యాయమూర్తి నిశ్చేష పోయారట. ప్రస్తుతం యాసిడ్ రాజా జైల్లో ఊచలు లెక్క పెడుతూకూర్చొని వున్నాడట. కొత్త ధోరణిలో హింస, దొంగతనాలకు సినిమాలు నేడు దారి చూపిస్తున్నాయని పలువురు గగ్గోలు పెట్టుతున్నా సినీ జీవులు మారరు కదా!

చిత్రసమీక్ష

9 పేజీ కొరవ

వస్తుంది. దేశాన్ని సర్వ నాశనం చేసేందుకు ఒక పార్లమెంటు మెంబరు అండతో చెలామణిగా అవుతున్న ఒక ముఠా, తను పథకాన్ని కంప్యూటర్ మీద చూపుతూ వుంటే భారతి తండ్రి హవల్దార్ దొంగ చాటుగా ఆ విషయాలు కాగితం మీద వ్రాసుకుంటూ వుంటాడు. అది చూసిన ముఠా మనుషులు హవల్దారును భారతి ముందే చంపేస్తారు. ఈ గొడవలో హవల్దారు వ్రాసిన కాగితం ఒక మూల పడటం; గోడకు తగిలించి వున్న భగత్‌సింగ్ ఫోటో తెగి ఆ కాగితం మీద పడటం జరుగుతుంది. ఇది తెలియని ముఠా వాళ్ళు ఆ కాగితం భారతి వద్ద వుందని భావించి ఆమెను వెంటాడుతారు. భారతి ద్వారా అసలు రహస్యం తెలుసుకున్న స్టైషన్ మాస్టర్ రంగ ప్రవేశం చేసి కాగితాన్ని తీసుకొని పెద్ద డిటెక్టివ్‌గా మారుతాడు. అంతర్జాతీయ టెర్రరిస్టులను హతమారుస్తాడు. పార్లమెంటు మెంబరు గుట్టు రట్టు చేస్తాడు. స్టైషన్ మాస్టర్ వీర చరిత్ర, దేశభక్తిని గుర్తించిన ప్రభుత్వం ఆయనకు "అశోకచక్ర" బిరుదు నిస్తుంది.

ఈ కథలో చెప్పదలచుకున్న ముఖ్య విషయాలను తుంగలో తొక్కి హీరో చేత పొడుపు కథలు చెప్పించి విసిగించారు. "మగాడికి ఒకటి ఆడదానికి రెండు" ఏమిటో చెప్పండి అని ప్రియురాళ్ళను అడగటం వంటి వంటి వికారమైన పనికి మాలిన హాస్యం చూపించారు దర్శకుడు బోయిన సుబ్బారావు. ఏ పాత్రా సరిగ్గా కుదరలేదు. అందువల్ల మంచి నటులు గొల్లపూడి, చంద్రమోహన్, కోట శ్రీనివాస రావు, బ్రహ్మానందంలు చప్పబడి పోయారు. స్టైషన్ మాస్టర్‌గా శోభన్‌బాబు పొద్దు వాలిన వయసులోనూ ముడతలు బడ్డ ముఖంతో అందంగా వున్నాడు. హీరోయిన్ భారతిగా ప్రియారామన్ వెన్నెల బొమ్మలా కన్పించి శోభన్‌బాబు ముసలి ముఖం కోసం మంచి నృత్యాలు చేసింది. హీరో కుర్రవాడైతే ఇంకెంత ఒళ్లు విరుచుకొని ఆరాట పడేదో? మాస్టర్ ఆదిత్య పాత్రను భ్రష్టు పట్టించారు. కుర్రాడి నటన ఖూనీ అయింది. కోటి సంగీతంలో "మావిడాకు తోరణం రాలడానికి" పాట బాగుంది. సురేష్ కెమెరా ప్రకృతిని బాగా చిత్రీకరించింది.

...d and Published by Nellore Dolendra Prasad at Zaminryot Press, Offset Printing at Nayagara Paper Products (I) ltd., NELLORE